


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-3-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 45 పేజీలు: 8+16 వెల: 6.50



అమెరికా ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ వాసులు మృతి 3

రూ. 400 కోట్ల పన్ను చెల్లించిన అయోధ్య ట్రస్టు 5


# బిసి బిల్లులకు గ్రీన్‌సిగ్నల్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి17:** తెలంగాణలో చారిత్రాత్మకమైన బిల్లులు ఆమోదం పొందాయి. బీసీలకు మేలు జరిగే బీసీ రిజర్వేషన్లకు సంబంధించి 2 బిల్లులకు తెలంగాణ శాసనసభ ఆమోదం లభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులను సోమవారం సాయంత్రం శాసనసభ ఆమోదించింది. దీని ద్వారా విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును సైతం అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

2

**మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టు ఉన్నట్లా?: సిఎం రేవంత్**

## 42 శాతం రిజర్వేషన్లకు కేంద్ర ఆమోదం తెచ్చుకుందాం

### అన్ని పార్టీల నేతలతో ప్రధాని, రాహుల్‌ను కలుద్దాం

### చట్టబద్ధత కోసమే ఈ రెండు బిల్లులు

### ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం లేఖ రాశానన్న సిఎం రేవంత్

బిల్లులు ఆమోదం పొందిన అనంతరం శాసనసభ మంగళవారానికి వాయిదా పడింది. అంతకు ముందు సిఎం రేవంత్‌రెడ్డి సభలో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపుపై ఇవాళ అసెంబ్లీలో ప్రవేశపెట్టింది తీర్మానం కాదని బిల్లు అని స్పష్టం చేశారు. చట్ట పరంగా సాధించుకునేందుకు నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈసారి 4 ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ,ఎస్టీ, బీసీలకే ఇచ్చామని ఆయన అసెంబ్లీలో గుర్తు చేశారు. 1979లో మండల్ కమిషన్ వేశారని, మండల్ కమిషన్‌తోనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ప్రారంభమైందని సీఎం అన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించామని గుర్తు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఏడాదిలోపు ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మద్దతు ఇస్తున్న అందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం నుంచి అంగీకారం కోసం పోరాడుతానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసేందుకు అన్ని పార్టీల నేతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ జరగాలని వెల్లడించారు. అవసరమైన రాజ్యాంగ సవరణ జరిగేలా అందరం కలిసి

>>2



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన న్యూజిలాండ్ పిఎం క్రిస్టఫర్ లక్సన్

## న్యూజిలాండ్, భారత్ మధ్య రక్షణ సహకారం

### ప్రధాని మోడీతో భేటీ అయిన న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్

**న్యూఢిల్లీ, మార్చి 17:** ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోను సహించబోమని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేసారు. 2019లో క్రైస్ట్‌చర్చ్ నగరంపై జరిగిన దాడి అయినా 2008లో ముంబయిపై జరిగిన దాడి అయినాసరే తమ వైఖరి ఒకటే అని అన్నారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలోసహకారాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.వ ఎనదేశంలో పర్యటిస్తున్న న్యూజిలాండ్‌ప్రధాని క్రిస్టఫర్ లక్సన్‌తో భేటీ అనంతరం మోడీ ఉగ్రవాదంపై భారత్ స్పష్టమైన వైఖరితో ఉందన్నారు. న్యూజిలాండ్‌లో కొన్ని శక్తులు భారత్ వ్యతిరేక

>>2

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు తిరుమలేశుని దర్శనాలు



### వారంలో 4 రోజులు అనుమతి

**తిరుమల,మార్చి 17ప్రభాతవార్త ప్రతినిధి:** విమర్శలు, వాదోపవాదాలు.. ప్రతిఘటనలతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాలు కల్పిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానమ్ కీలక నిర్ణయం తీసుకుంది. వారంలో నాలుగు రోజులు వారినుండి వచ్చే లేఖలను స్వీకరించి ప్రాధాన్యతను బట్టి విఐపి బ్రేక్ దర్శనాలు, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు జారీచేసేలా చూడనున్నారు. వారంలో నాలుగురోజులు తెలంగాణ లేఖలకు దేవుని దర్శనాల అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈనెల 24వతేదీ

>>2

# కేంద్రంలో 'సౌత్' కీలకం



సోమవారం అఖిలపక్ష భేటీలో మాట్లాడుతున్న సీనియర్‌నేత జానారెడ్డి. చిత్రంలో డి.సిఎం భట్టి, కేశవరావు, కూనంనేని

### ప్రభుత్వం ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం

### సైంటిఫిక్ విధానం కనుగొనేదాకా పునర్విభజన వాయిదా వేయాలి.. అఖిలపక్ష సమావేశంలో నేతలు

### భేటీకి గైర్హాజరైన బిజెపి, బిఆర్ఎస్, హాజరైన ఎంఐఎం, లెఫ్ట్ పార్టీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి17:** కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు క్రమంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యంగా ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనపై సోమవారం అసెంబ్లీ ఆవరణలోని కమిటీ హాల్ లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ, ఎంఐఎం, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, రిపబ్లిక్కన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు ప్రధానంగా తెలంగాణ నష్టపోతుంది ఈ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై చర్చలు, ఆలోచనలు చేయాలని సమావేశానికి హాజరైన రాజకీయ పక్షాలను డిప్యూటీ సీఎం కోరారు. మన గౌరవం, ప్రాధాన్యత కాపాడుకుంటూ భారత దేశంలో మన అందరి పాత్ర ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ నేతలను సైతం ఆహ్వానించినప్పటికీ వారు ప్రత్యేక రాజకీయ కారణాలతో సమావేశానికి హాజరు కాలేమని తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్లమెంటు సమావేశంలో బిజీగా ఉండడం, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వారు హాజరు కాలేదని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశానికి హాజరైన నేతలంతా ఇచ్చిన సమాచారం మేరకు భవిష్యత్తులో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక తయారు చేసుకొనే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి అని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో ఆందోళనకు దారి తీయకుండా కొంతకాలం ఇదే విధానం కొనసాగించాలని, నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆలోచన చేయకపోతే ప్రమాదం ఉందన్న స్పృహ వారికి కలగజేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక సైంటిఫిక్ నిర్ణయం వచ్చేవరకు నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతానికి అనుగుణంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్య పెంచాలని సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓవైపు ఈ అంశంపై

>>2

## తుమ్మడిహట్టి పనులను పునఃప్రారంభిస్తాం

### -మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** తుమ్మడి హట్టి పనులను పునః ప్రారంభిస్తామని.. ఏప్రిల్ నెలలో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు వెళ్లి చర్చిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం శాసనమండలిలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సోమవారం శాసనమండలి సమావేశాల్లో నీటిపారుదలతోపాటు.. ధాన్యం కొనుగోలుపై పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానమిచ్చారు. తుమ్మడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటిలోగా పూర్తవుతుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ప్రశ్నించారు. ఇందుకు మంత్రి సమాధానమిస్తూ .. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పునఃప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ నెలలో

>>2

## 20 నుంచి కెటిఆర్ రాష్ట్ర వ్యాప్త పర్యటన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి17:** భారత రాష్ట్ర సమితి 25సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. ఇప్పటికే వరంగల్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వేటిని అమలు చేయకుండా వంచి స్తుందంటూ జనంలోకి

>>2

## సునీత, విల్మోర్ నేడు ఫ్లోరిడా తీరానికి చేరిక!



### ఎట్టకేలకు రోదసి నుంచి భూమికి చేరుకొంటున్న వ్యోమగాములు

### సక్రమంగా ప్రయాణిస్తున్న స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక

**వాషింగ్టన్, మార్చి 17:** అంతరిక్షంలో సుమారు 9 నెలలపాటు గడిపిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు ఎట్టకేలకు భూమికి చేరుకుంటున్నారు. మరికొన్ని గంటల్లోనే వారి తిరుగు పయనం ప్రారంభం అవుతుంది. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5.57 గంటలకు వారు భూమిమీద ల్యాండ్ అవుతారు. వారి రాకపై నాసా తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీరిద్దరికోసం రోదసిలోకి వెళ్లిన స్పేస్ ఎక్స్ వ్యోమనౌక క్రూడ్రాగన్ ఆదివారం విజయవంతంగా భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్షకేంద్రంతో అనుసంధానం అయింది. క్రూ-10 మిషన్‌లో వెళ్లిన నలుగురు వ్యోమగాములు ఒక్కొక్కరుగా అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించారు. దీనితో సునీత రాకకు మార్గం సులువయింది. ఈమేరకు రిటర్న్ షెడ్యూలును నాసా తాజాప్రకటనలో వెల్లడించింది. క్రూడ్రాగన్ వ్యోమనౌక హ్యాచ్‌మూసివేత సోమవారం రాత్రి 10.45 గంటలకు మొదలయింది. అర్ధరాత్రి 12.45 గంటలకు అంతరిక్ష కేంద్రంనుంచిక్రూడ్రాగన్‌వ్యోమనౌక అన్‌డాకింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఈ వ్యోమనౌక విజయవంతంగా విడిపోయిన తర్వాత మంగళవారం సాయంత్రం

>>2

## తెలుగు వర్సిటీకి సురవరం పేరు



### అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం

### అవమానపరచడానికి కాదు... తెలంగాణ అస్తిత్వం చాటేందుకే..

### చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడదాం

### నేచర్ క్యూర్ హాస్పిటల్‌కు రోశయ్య పేరు, అక్కడే ఆయన విగ్రహం కూడా

**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ సురవరం ప్రతాప రెడ్డి పేరును పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సంబంధిత బిల్లును అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించాయి. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం అసెంబ్లీ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజకీయాలు కలుషితమయ్యాయో, నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటంలేదని,వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలన్నారు. పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కొన్ని వర్గాలకు కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నామని,ఇది ఎన్టీఆర్‌ను అగౌరవపరిచినట్టు కాదు అని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామన్నారు. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరును పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డిపేరు పెట్టుకొంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలని రాష్ట్ర గత శాసనసభ సమావేశాల్లో సభ దృష్టికి సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా వచ్చిందన్నారు. పేరు

>>2

## ఎంపి అరుణకు భద్రత పెంపు



### సిఎం రేవంత్ ఫోన్ కాల్..

### ఆగంతకుడు చొరబాటుపై ఆరా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి17:** మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇంట్లో అగంతకుడు ప్రవేశించిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మరోవైపు విషయం తెలిసిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ క్రమంలో ఘటన గురించి డికె అరుణకు ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీకి భద్రతను మరింత పెంచాలని పోలీసులను

>>2

## తెలంగాణలో రోప్‌వే పర్యాటకం

### భువనగిరి కోట.. యాదగిరి గుట్టపై నిర్మాణం

### స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి17:** తెలంగాణలో రోప్ వే పర్యాటకం త్వరలోనే అందుబాటులోకి రానుంది. స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద భువనగిరి కోటను రూ. 56.81 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు పర్యాటక సంస్థ తాజాగా టెండర్లు పిలిచింది. హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారి నుంచి కోట వరకు కిలోమీటరు దూరం రోప్ వే ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఇదే తొలి రోప్ వే కానుంది. ఏకశిల రాతిగుట్టపై నిర్మించిన భువనగిరి కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. ట్రెక్కింగ్ ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో ఒకటైన ఈ కోటపైకి చేరడానికి దాదాపు గంట సమయం పడుతుంది. ఇప్పుడు రోప్ వే ఏర్పాటైతే మెట్లు ఎక్కే సమస్య తప్పడంతోపాటు రోప్ వే సరికొత్త అనుభూతిని పంచుతుంది. అలాగే కోటపైకి రోప్ వే ఏర్పాటుతోపాటు కోటపై ఉన్న నీటి కొలను,

>>2

# బిసి బిల్లులకు గ్రీన్‌సిగ్నల్

>> పోరాడుదామని, పార్లమెంటులో చట్టం కోసం మోదీ, రాహుల్‌గాంధీని కలుద్దామని అన్నారు. రాష్ట్రంలోని బిసిలకు అసెంబ్లీ వేదికగా అండగా ఉంటామన్న సందేశాన్ని తెలియచేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలో విద్య,ఉద్యోగ, రాజకీయ తదితర రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఈ రిజర్వేషన్లను సాధించేందుకు జరిగే ప్రయత్నానికి తాను నాయకత్వం వహిస్తానని, అన్ని పార్టీల ప్రతినిధులను ప్రధాని వద్దకు తీసుకెళతానని చెప్పారు. బిసిలకు 42 శాతం మేర విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లు, అలాగే రాజకీయాలలో రిజర్వేషన్లు కల్పించేందుకు సంబంధించిన రెండు బిల్లులను సోమవారం శాసనసభలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారు. దానిపై జరిగిన చర్చ సందర్భంగా సిఎం మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. పక్కా లెక్కలతో 42 శాతం రిజర్వేషన్ల కల్పించేందుకు చట్టబద్దత తీసుకొనస్తూ శాసనసభలో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింప చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో కుల గణనపై సర్వే జరుపుతామని పార్టీ అధినేత రాహుల్ గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తెలంగాణలో దేశంలోనే తొలి సారిగా కులగణనపై సర్వే చేసినట్లు వెల్లడించారు. బలహీనవర్గాలకు సమన్యాయం చేసేందుకు కులగణన నివేదికలో తేలిన లెక్కలను అనుసరించి 42 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండు దశలుగా కులగణనను పక్కాగా నిర్వహించామన్నారు. తొలి విడతలో రాష్ట్రంలోని 1,12,15,134 కుటుంబాలు, మిగిలిన వారి కోసం నిర్వహించిన రెండో విడత సర్వేలో 21,715 కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని వివరించారు. రెండు దశల్లోనూ మొత్తంగా 3,55,50,759 మంది ఈ కులగణన సర్వేలో పాల్గొన్నారన్నారు. ఎక్కడా ఎటువంటి తేడాలు లేకుండా పారదర్శికంగా సర్వేచేసి పక్కాగా బిసి లెక్కలు తేల్చామని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో మొత్తం జనాభాలో బలహీనవర్గాలకు చెందిన జనాభా 56.36 శాతం ఉన్నట్లు పక్కాగా లెక్క తేలిందని తెలియచేశారు. తెలంగాణలో 4 కోట్ల సమాజంలో బిసిలకు రిజర్వేషన్లపై ఏకాభిప్రాయంతో ఉన్నామని, అలాగే బలహీన వర్గాలకు అండగా ఉన్నామని 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు తీసుకొచ్చి ఆ వర్గాల వారికి హామీ ఇచ్చినట్లు అయిందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు, స్థానిక సంస్థలు వంటి రాజకీయ రంగంలోనూ 42 శాతం రిజర్వేషన్లకు ప్రత్యేకించి రెండు బిల్లుల రూపంలో తీసుకొచ్చి వాటికి అసెంబ్లీలో చట్ట బద్దత కల్పిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో గత ప్రభుత్వ హయంలో 2017లో 37 శాతం రిజర్వేషన్లకు సంబంధించి అప్పటి అసెంబ్లీలో చేసి తీర్మానాన్ని గవర్నర్ రాష్ట్రపతి ఆమోదానికి పంపితే అది అక్కడ పెండింగ్‌లో ఉండిపోయిందని, న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు దీన్ని ఉపసంహరించుకున్నామని వెల్లడించారు. ఈ బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం చేసిన ప్రకటన చేసిప్పటి నుండి, కమిషన్ ఏర్పాటు, మంత్రివర్గం, శాసనసభ ఆమోదం వరకూ జరిగిన ప్రక్రియను వివరిస్తూ దీనికి గుర్తుగా ఫిబ్రవరి 4వ తేదిన సామాజిక న్యాయ దినోత్సవం కింద ప్రకటించినట్లు చెప్పారు. రాజకీయ రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని పార్టీలను కలుపుకొని వెళతామని, దానికి తాను నాయకత్వం వహిస్తానని తెలియచేశారు. ఇందులో భాగంగా 42 శాతం మేర బిసి రిజర్వేషన్ల సాధనకు అన్ని పార్టీల నేతలతో కలిసి ప్రధానమంత్రిని కలుస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ల బిల్లు ప్రస్తావనకు వచ్చేలా తమ పార్టీ నాయకుడు రాహుల్‌ని కూడా కలుస్తామన్నారు. రాహుల్‌గాంధీ అప్పాయింట్‌మెంట్ తీసుకోవాల్సిందిగా టిపిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కోరుతున్నానని, ప్రధాని మోడీ అప్పాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యత తీసుకోవాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి,బండి సంజయ్,బిజెపి సభా పక్ష నాయకుడిని కోరుతున్నట్లు సభలో ప్రకటించారు. కాగా, సోమవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. కాంగ్రెస్,బిఆర్ఎస్,బిజెపి,ఎంఐఎం, సిపిఐ నాయకులతో ప్రధానిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాశారు. స్థానిక సంస్థలతో పాటు విద్య,ఉద్యోగరంగాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు 42శాతానికి పెంచాలని రెండు బిల్లులను ఏకగ్రీవంగా శాసనసభ అమోదించినట్లుగా ప్రధానికి లేఖలో తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్లులకు కేంద్రం మద్దతు కోరేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ లేఖలో ప్రధానిని కోరారు. ఇదిలా ఉండగా, అపాయింట్‌మెంట్ కోసం ప్రధానికి రాసిన లేఖ కాపీలను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు సిఎం పంపినట్లు సమాచారం.

## మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టు ఉన్నట్లా?: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి17:** తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని,మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా? ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లా? అని ప్రశ్నించారు. అన్నింటిని సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని, అందరికీ ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికి రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. యువ వికాసానికి సోమవారం(మార్చి 17) నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్లు మంజూరు చేస్తారు.ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇది పార్టీ పథకం కాదు.. ప్రజల పథకం.. రూ.6000 కోట్లతో 5 లక్షల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. శాసన సభ ప్రాంగణంలో ఒక మంచి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది.అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ఇదే ప్రాంగణంలో ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. ఈ 15 నెలల్లో 57 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసుకున్నాం, తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలకు 1కోటీ 30 లక్షల నాణ్యమైన చీరలను అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. స్వయంసహాయక సంఘాల్లోని 63 లక్షల మంది మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 29,500 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల నిర్వహణ ఆడబిడ్డలకు అప్పగించాం, స్వయం సహాయక సంఘాల మహిళలకే పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని తమ ఎమ్మెల్యేలకు చెప్తుంటానని వెల్లడించారు. కార్యకర్తలకే ఇవ్వాలంటే పార్టీ పదవులు ఇద్దామని చెప్తుంటానని, ప్రభుత్వ పథకాల విషయంలో మాత్రం పార్టీలను చూడొద్దని చెప్తున్నానని అన్నారు. అసలైన అర్హులకు పథకాలను తప్పక వర్తింపచేయాలని అధికారులను చెప్తుంటానని తెలిపారు. రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు మంజూరు చేసేందుకు దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించుకున్నామని తెలిపారు.జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామన్నారు, రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి కలిగించొచవచ్చని చెప్పారు.'నిజమైన నిరుద్యోగులకు ఇది అందాలి, వారికిది ఉపయోగపడాలి.పథకాల అమలులో పారదర్శకంగా ఉండాలి.. అప్పుడే ప్రజలకు మెరుగైన పాలన అందించగలుగుతాం' అని పేర్కొన్నారు.తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క,కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసి. సిపిఐ శాసనసభా పక్ష నేతల కూనంనేని సాంబశివరావు, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీ, న్యూజిలాండ్ పిఎం క్రిస్టఫర్ లక్సన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాల మంత్రులు

## న్యూజిలాండ్, భారత్ మధ్య రక్షణ సహకారం

>> కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాన్ని ఆదేశప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఇక భేటీలో భాగంగా వాణిజ్యం, రక్షణ,విద్య, వ్యవసాయం వంటి రంగాలపై వారిమధ్య చర్చలుజరిగాయి. రక్షణరంగంలో రెండుదేశాలమధ్య సహకారం కొనసాగించేదిశగా ఒక ఒప్పందంపై స ంతకాలుచేసాయి. అలాగే పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంకోసం చర్చలుప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ఉపయోగపడే విధంగా ఉభయతారక వాణిజ్యసామర్థ్యం పెరుగుతుందని, పాడిపరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్; ఫార్మా వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసారు. తాము అభివృద్ధి వాదాన్ని కోరుకుంటునానమని విస్తరణవాదాన్ని కాదని రెండుదేశాలు వెల్లడించాయి. 2019లో క్రైస్ట్‌చర్చ్ నగరంలోని మసీదుపై జరిగిన ఉగ్రదాడి ఘటనలో 51 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ దాడినే ప్రస్తుతం మోడీ ప్రస్తావించారు.

## తెలుగు వర్సిటీకి సురవరం పేరు

>> మార్చినంత మాత్రాన పొట్టి శ్రీరాములు త్యాగాలను తక్కువగా చూడటం లేదన్నారు. ఆయన ప్రాణత్యాగాలను మనం స్మరించుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ ఏపీలో కొనసాగుతోందన్నారు. తెలంగాణ వచ్చాక అనేక వర్సిటీలకు పేర్లు మార్చుకున్నామని చెప్పారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం ఎంతో అవసరమన్నారు. తెలంగాణ వచ్చాక ఆర్టీసీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్లు మార్చుకున్నామని చెప్పారు. కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పీవీ నరసింహారావు పేర్లు పెట్టుకున్నామని తెలిపారు. అదే ఒరవడిలో తెలుగు వర్సిటీ పేరును మారుస్తున్నామన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఒక వ్యక్తి కోసమో ఒక కులం కోసమో కాదన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డితెలంగాణకు గొప్ప సేవ చేశారని గుర్తు చేశారు. నిజాంకు వ్యతిరేకంగా సురవరం ప్రతాప్‌రెడ్డి పోరాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పాత పేర్లతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్, ఎన్‌జిరంగా, పొట్టిశ్రీరాములు యూనివర్సిటీలు కొనసాగుతున్నాయని తెలంగాణలో తెలంగాణ అస్థిత్వాన్ని తెలిపే వ్యక్తుల పేర్లు కొత్తగా నామకరణం చేసి మార్చుకున్నామన్నారు. ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుందన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నామని వెల్లడించారు. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదని క్లారిటీ ఇచ్చారు. విశాల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు కులాన్ని ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటే అది తప్పని అన్నారు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియం పేరు తొలగించి ప్రధాని మోదీ పేరు పెట్టారన్నారు. తాము అలాంటి తప్పిదాలు చేయలేదని చేయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామన్నారు. చిత్తశుద్ధి ఉంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలని అన్నారు. బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్‌కు రోశయ్య పేరు పెట్టుకుందామన్నారు. రోశయ్య సేవలను కీర్తించుకునేలా అక్కడ వారి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## పునఃప్రారంభిస్తాం

>> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలసి మహారాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు అక్కడి నీటిపారుదల శాఖాధికారులతో సంప్రదింపులు జరుపనున్నట్లు మంత్రి వెల్లడించారు.నీటి లెవల్స్ ను నిర్ణయించి తుమ్మిడి హట్టి ప్రాజెక్టుకు తుది రూపం ఇవ్వబోతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే నిధుల అంచనాలు పెరగడాన్నీ ఆయన వివరిస్తూ వర్జినల్ ప్రాధమిక ప్రాజెక్టు నివేదికలో డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ కు అవసరమైన భూమి తాలూకు వివరాలు పొందుపరచక పోవడమే కారణమని సభకు తెలిపారు. అంతేగాకుండా అదే ప్రాధమిక నివేదికలో విద్యుత్ సబ్‌స్టేషన్లకు అవసరమైన నిధులు కలపక పోవడంతో పాటు జిఎస్‌టి 4 శాతం నుండి 8 శాతం పెరగడంతో అంచనాలు పెరిగాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ముందుగా రూపొందించిన ప్రాధమిక నివేదికలో 9వేల ఎకరాలు ఉండగా ప్రస్తుతం 18 వేల ఎకరాల భూసేకరణ అవసరం కావడంతో .. పెరిగిన అదనపు భూసేకరణ, విద్యుత్ సబ్ స్టేషన్లు, పెరిగిన జిఎస్‌టిలతో రూ. 13,057 కోట్ల నుండి రూ. 19,465 కోట్లకు అంచనాలు పెరిగాయాని తెలిపారు.

## సిఫార్సులకు తిరుమలేశుని దర్శనాలు

>> నుండి ఈ విధానం తిరుమలలో అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నుండి టిటిడి అధికారులకు కీలక ఆదేశాలందాయి. రానున్న వేసవిసెలవుల సమయంలోనే తెలంగాణ ప్రజలు తీసుకువచ్చే సిఫార్సులేఖలను అనుమతించి దర్శనాలు చేయించాలని, లేకుంటే తిరుమలకు వచ్చి తేల్చుకుంటామని ఇటీవల ఎంపి రఘునందనరావు ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.దీనిపై ఇప్పటికే తెలంగాణ ప్రజాప్రతినిధులు నుండి కూడా అటు సిఎం చంద్రబాబుకు, ఇటు టిటిడి పాలకమండలికి పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. వీటన్నిటినీ పరిగణనలోనికి తీసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు తెలంగాణ ప్రజాప్రతినిధులు పంపే సిఫార్సు లేఖలకు విఐపి బ్రేక్ దర్శనాలు,300 రూపాయలు ఎస్‌ఇడి దర్శనాలు జారీకి సుముఖత వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్రప్రభుత్వానికి కూడా టిటిడి తెలిపింది. సంబంధించి తెలంగాణ సిఫార్సులేఖలను ఆది,సోమవారాల్లో మాత్రమే స్వీకరిస్తారు. వారికి సోమ,మంగళవారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తారు.

## ట్రంప్ ట్రూత్‌సోషల్‌లో చేరిన ప్రధాని మోడీ!

**న్యూఢిల్లీ, మార్చి 17:** ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌లమధ్య దౌత్యబంధంతోపాటు స్నేహబంధం కూడా పెనవేసుకుపోతోంది. ట్రంప్ సొంతంగా స్థాపించిన ట్రూత్ సోషల్‌మీడియాలోప్రధాని కూడా చేరారు. కృత్రిమమేధ పరిశోధకుడు లెక్స్‌ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో ప్రధానిమోడీ పాల్గొన్న విడియోను డొనాల్డ్‌ట్రంప్ తన సోషల్‌మీడియా నెట్‌వర్క్ ట్రూత్ సోషల్‌లో పోస్టుచేసారు. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాతప్రధాని నరేంద్రమోడీకూడా ట్రంప్ ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో చేరారు. అనంతరం తన మొదటి ట్రూత్ పోస్టులో తన వ్యాఖ్యలు కూడా పోస్టుచేసారు. ట్రూత్‌సోషల్ లోచేరినందుకు ఎంతో ఆనందంగా ఉంది.రాబోయే రోజుల్లో ఉద్వేగభరితమైన అర్థవంతమైన సంభాషణల్లో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అని మోడీ పోస్టుపెట్టారు.

## తీరానికి చేరిక!

>> 4.45 గంటలకు భూమికి తిరుగు పయనం అవుతుంది. సాయంత్రం 5.11 గంటలకు భూకక్ష్యలను దాటి కిందకు చేరుతుంది. సాయంత్రం 5.57 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో ఉన్న సముద్రజలాల్లో స్పేస్ ఎక్స్ క్యాప్సూల్ దిగుతుంది. అందులోనుంచి ఒక్కొక్కరిగా వ్యోమగాములను బయటకు తీసుకు వస్తామని నాసా వెల్లడించింది. సునీత, విల్మోర్‌లతో పాటు మరో ఇద్దరు వ్యోమగాములు కూడా భూమ్మీదకు రానున్నారు. 2024 జూన్5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లై నర్‌లో సునీత విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. ప్రణాళికప్రకారం వీరు వారం రోజులకే భూమినిచేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్ సాంకేతిక సమస్యలతో వ్యోమ గాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది.అప్పటినుంచి సునీత, విల్మోర్‌లు అంతర్జాతీయ రోదసి కేంద్రంలోనే ఉండి పోవాల్సి వచ్చింది.

## రాష్ట్ర వ్యాప్త పర్యటన

>> వెళ్లేందుకు కార్యాచ రణపై పార్టీ శ్రేణులకు, జిల్లా నేతలకు, కార్యకర్తలకు కేటీఆర్ స్వయంగా మార్గద ర్శనం చేయనున్నారు.ఈ నేపథ్యంలో ఈనెల 20న సూర్యాపేట జిల్లా కార్యక ర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.అసెంబ్లీ బడ్జెట్ సమా వేశాల అనంతరం కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థాన ంతో పాటు,పదేండ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోనున్నారు. పార్టీకి ఎన్ని రకాల ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉండబోతున్న విషయాన్ని కేటీఆర్ తెలియజేయనున్నారు. ఏడాదిన్నరలోనే తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ప్రజల భరోసా ఇప్పుడు బీఆర్ఎస్ పైన, కేసీఆర్ పైనే ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయబోతున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 18-03-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
చవితి రా.10.10
స్వాతి సా.5.51
వర్జ్యం రా.12.08-1.56
దు.ఉ.8.47-9.35
2) రా.11.16-12.04
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది.

**వృషభం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగినా నిదానంగా తీసుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**కర్కాటకం :** డబ్బు కోసం ఇబ్బందులు ఎదురైన సకాలంలో అందుతాయి. రుణ వత్తుడులు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** కుటుంబసమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**కన్య :** సన్నిహితుల నుంచి ఆర్థిక లాభం పొందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**తుల :** రుణాలు తీరి ఊరట చెందుతారు. మాటల చాతుర్యంతో అందర్నీ ఆకట్టుకుంటారు. వస్తులాభం.

**వృశ్చికం**ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. రుణవత్తిడులు తొలగుతాయి. ఆకస్మిక ధనలాభం.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. కీలక నిర్ణయాలు సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మకరం:** దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు.

**కుంభం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**మీనం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. మానసిక అశాంతి ఏర్పడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



థానేలోని భివాండిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ దేవాలయాన్ని (శక్తిపీఠ్) ప్రారంభించిన అనంతరం ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్

## తెలంగాణలో రోప్‌వే పర్యాటకం

>> చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, ప్రవేశ ద్వారం, రోడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తారు.భువనగిరి కోటతోపాటు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, నల్గొండలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ఆనకట్ట, మంథనిలోని రామగిరి కోట వరకు కూడా రోప్ వే ఏర్పాటు చేస్తారు. నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా 5 కిలోమీటర్ల మేర రోప్ వే నిర్మించనుండగా మిగతావన్నీ 2 కిలోమీటర్ల మేర ఉన్నాయి. భువనగిరి కోట ప్రాజెక్టులో భాగంగా రోప్ వే కోసం రూ. 15.20 కోట్లు ఖర్చు చేయనుండగా 30 మీటర్ల వెడల్పుతో యాక్సెస్ రోడ్డు, పార్కింగ్ వంటి నిర్మాణాల కోసం రూ. 10.73 కోట్లు, ప్రవేశద్వారం, టూరిజం సదుపాయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణకు రూ. 10.37 కోట్లు, ఇతర ఏర్పాట్లకు రూ. 11.11 కోట్లు ఖర్చు చేస్తారు.

## ఎంపి అరుణకు భద్రత పెంపు

>> ఆదేశించారు. ఈ ఘటన ఎలా జరిగింది? ఆగంతకుడు ఎవరు? ఆయన ఉద్దేశం ఏంటి? అన్న విషయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. భద్రతా పరంగా లోపాలేమైనా ఉన్నాయా? పోలీసుల నుంచి తగిన సహాయ సహకారాలు అందుతున్నాయా? అనే విషయాలపై కూడా చర్చించారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.. ఈ ఘటనలో తన అనుమానాలను డీకే అరుణ సీఎంతో ప్రస్తావించారు. అకారణంగా తన నివాసంలోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించడం శోచనీయమని, ఇది భద్రతా వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెడుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి, డీకే అరుణ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఆమెకు అదనపు భద్రత కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాజకీయ నేతల భద్రత విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ అసెంబ్లీలో ఐదు బిల్లులు ప్రవేశం

**హైదరాబాద్,మార్చి 17,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ సవరణ బిల్లుతోపాటు ఐదు బిల్లులు ప్రవేశపెట్టడానికి శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు కొశ్చన్‌అవర్ పూర్తికాగానే జీరో అవర్ ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అనుమతి అడిగారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయ బిల్లు దామోదర రాజనర్సింహా, వెనుకబడినతరగతుల బిల్లును పొన్నంప్రభాకర్ తెలంగాణ ధార్మిక హిందు మత సంస్థల బిల్లును కొండ సురేఖ ప్రతిపాదించారు.

## కేంద్రంలో 'సౌత్' కీలకం

>> పోరాటం చేస్తూ మరోవైపు సైంటిఫిక్ పరిష్కారం కోసం రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు నిత్యం ఆలోచన చేయాలని కూనంనేని, వెస్లీలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నియోజకవర్గ పునర్విభజనపై జాతీయస్థాయిలో ఒక పాలసీని తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెడరల్ స్టేట్ అంటే ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండాలి, నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం అభినందనీయమని సిపిఎం మాస్ లైన్ నేత హనుమేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారం దక్షిణాదిలోను నియోజకవర్గం పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌గౌడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక సమావేశమైనని రాబోయే రోజుల్లో విస్తృతంగా ఈ అంశంపై చర్చ, కార్యక్రమాలు చేపట్టాలని అఖిలపక్ష సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్న ఆచరణలో పెట్టేందుకు సిద్ధమని సమావేశానికి హాజరైన పార్టీల నేతలు తెలిపారు.ఈ సమావేశానికి మాస్‌లైన్ నేత సూర్యం, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రిపబ్లిక్ ఆన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సిహెచ్ బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బి.మహేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం దుర్గాప్రసాద్ తదితరులు కూడా హాజరయ్యారు.

## బిసి బిల్లుకు బిఆర్ఎస్ మద్దతు

### ఢిల్లీకి సైతం వచ్చి పోరాడుతాం: హరీష్‌రావు

హైదరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బిసి బిల్లును బిఆర్ఎస్ పార్టీ పక్షాన మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ పూర్తి మద్దతు తెలుపుతున్నామని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం శాసనసభలో బిసి బిల్లుపై హరీష్‌రావు మాట్లాడుతూ ఎప్పుడు నిజంగా బిసి వర్గాలు సంతోషపడతాయంటే విద్యా ఉద్యోగాల్లో బిసిలకు 42 రిజర్వేషన్ వచ్చినప్పుడు, స్థానిక సంస్థల్లో, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 42 శాతం రిజర్వేషన్ ఫలితాలు వారికి అందినప్పుడు ఆ వర్గాలు చాలా సంతోషపడతాయని అన్నారు. వారికి ఆ ఫలితాలు అందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర శాసనసభలో మనం బిల్లు ఏర్పాటు చేయడంతో పాటు పార్లమెంటులో పోరాటానికి కూడా బిఆర్ఎస్ పార్టీ కలిసి వస్తుందన్నారు. ఈ బిల్లు పాస్ కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష పార్టీ 100 మంది ఎంపిలు ఉన్నారన్నారు. ఈ బిల్లు కోసం రాహుల్ గాంధీ గట్టిగా పూనుకోవాలని కోరుతున్నామని అన్నారు. గతంలో కెసిఆర్ ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌లో, డైరెక్టర్లు లో బిసిలకు 50 రిజర్వేషన్ తెచ్చింది బిఆర్ఎస్ పార్టీ అన్నారు. మొట్టమొదటిసారి దేశంలో ఎక్కడాలేని విధంగా గౌడన్నల కోసం మద్యం షాపుల్లో రిజర్వేషన్ తెచ్చింది బిఆర్ఎస్ పార్టీ అని, సభలో బడ్జెట్ పెడుతున్నారు కాబట్టి బిఆర్ఎస్ పార్టీ పక్షాన మూడు అంశాలను బేషజాలకు పోకుండా చేర్చాలని కోరుతున్నామని అన్నారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టండి

### రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి17:** చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును 'పొట్టి శ్రీరాములు చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్'గా మార్చాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆశ్విని వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి లేఖ రాశారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందే విధంగా రాష్ట్రానికి కొత్త టెర్మినల్‌ను చర్లపల్లిలో ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యంగా రైజింగ్ తెలంగాణ కోసం అడుగులు వేస్తున్న మా రాష్ట్రానికి చెర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్ ఏర్పాటు ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని ఆ లేఖలో కోరారు.

# 25.35 లక్షల మందికి రూ. 20,616 కోట్లు రుణమాఫీ చేశాం

### శాసనమండలిలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్నాం.. భవిష్యత్‌లో కళ్యాణమస్తు పేరుతో అమలు చేస్తాం

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు రూ. 20,616 కోట్లను రుణమాఫీ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని.. భవిష్యత్‌లో కళ్యాణమస్తు పేరుతో పథకాన్ని కొనసాగించనున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో సమాధాన మిచ్చారు. శాసనమండలి సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేం దర్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బల్మూర్ వెంకటనర్సింగ్ రావులు రాష్ట్రంలో రైతుభరోసా, రుణమాఫీ పథకం కింద ఎంత మందికి ఎంత రుణమాఫీ చేశారో తెలపాలని కోరారు. దీనికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. 2024లో రుణమాఫీ పథకాన్ని 4 ఫేజ్‌ల్లో 25,35,964 మందికి రూ. 20,616.89 కోట్లను మంజూరు చేసినట్టు తెలిపారు. 69.82లక్షల మంది రైతులకు రూ. 7,625,14 కోట్లను రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. 2024-25 సంవత్సరం నుంచి పెట్టుబడి సాయాన్ని రూ. 10వేల నుంచి రూ. 12వేలకు పెంచినట్టు తెలిపారు. ఈ ఏడాది మార్చి 15 నాటికి52.09 లక్షల మంది రైతులకు రూ. 4,166.21 కోట్లను విడుదల చేసినట్టు తెలిపారు. విద్యుత్‌శక్తిపై 29,14,692 మంది రైతులకు రూ. 9,800.07 కోట్లను సబ్సిడీగా విడుదల చేసినట్టు మంత్రి తుమ్మల సభకు తెలిపారు. సన్నబియ్యంపై 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 4,48,939 మంది రైతుల నుంచి క్వింటాల్‌కి రూ. 500 బోనస్‌తో రూ. 23.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయగా.. అందుకుగానూ రూ.1199.22 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కళ్యాణమస్తు పథకాన్ని అమలు చేస్తున్నారా? అని బిఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. దీనికి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. పేరు మార్చి కళ్యాణమస్తు పథకంగా కొనసాగించాలని భావించామని.. అయితే ప్రస్తుతం కళ్యాణలక్ష్మి పేరుతోనే కొనసాగిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కళ్యాణమస్తు పేరుతో అమలు చేస్తామని మంత్రి సభకు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాలకు సంబంధించి గత ప్రభుత్వం రెండు, మూడు సంవత్సరాలుగా పెట్టిన బకాయిలు పూర్తి చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కళ్యాణలక్ష్మి నిధులకు సంబంధించి ఎక్కడ ఇబ్బంది లేదదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా ఇబ్బంది లేకుండా వివాహాలు చేసుకునే వారికి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. గతంలో పెళ్లి అయి పిల్లలు పుట్టిన తరువాత చెక్కులు తీసుకునే పరిస్థితి ఉండేదని.. కానీ ఇప్పుడు బకాయిలు లేకుండా చూసుకుంటున్నామని.. వెంటనే చెల్లిస్తున్నామని మంత్రి సభకు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్.నారాయణమూర్తి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 17:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని ప్రముఖ సినీ నటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి కలిశారు. నేటి ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తిని సీఎం శాలువాతో సన్మానించారు. వచ్చే నెలలో గద్దర్ పేరు మీద తెలంగాణ సినీ అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గద్దర్ అవార్డుల విధి విధానాలు, నియమ నిబంధనలు, లోగో రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఆర్.నారాయణమూర్తి సలహాదారుగా ఉన్నారు. దీనిపై వారిద్దరూ చర్చలు జరిపారు.

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్లకు బెయిల్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో వున్న పల్స్ టివికి చెందిన మహిళా యూట్యూబర్లు రేవతి, తన్వీర్‌యాదవ్‌లకు నాంపల్లి కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. 25 వేల రూపాయల పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలతో న్యాయమూర్తి ఇద్దరికి బెయిల్ మంజూరు చేశారు. నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని అభ్యంతకర రీతిలో తిడుతున్న విడియో వైరల్‌గా మారడంతో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శి కైలాష్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ ఫిర్యాదు మేరకు ఈ నెల 12న పల్స్‌టివి అనే యూట్యూబ్ ఛానల్ నిర్వాహకురాలు రేవతితోపాటు ఈ ఛానల్‌లో పనిచేస్తున్న బండి సంధ్య అలియాస్ తన్వీర్‌యాదవ్‌ను సిటీ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేయడం విదితమే. అదేరోజున వీరిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రెండు వారాల రిమాండు విధించింది. అనంతరం ఇద్దరిని చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను విచారించిన నాంపల్లి కోర్టు ఇద్దరికి బెయిల్ మంజూరు చేసింది.

## హామీలన్నీ అమలుచేసేదాకా సిఎంను ప్రశ్నిస్తూనే ఉంటాం

### జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్‌లను పరామర్శించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



చంచల్‌గూడ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్ (సైదాబాద్), మార్చి 17, ప్రభాతవార్త:** చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్‌లను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోమవారం మాజీమంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌లతో కలిసి పరామర్శించారు. అనంతరం జైలువద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటే అదేదో సంక్షేమ రాజ్యం అని ప్రజలంతా భ్రమపడ్డారని, కెసిఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందే మోనన్న అపోహకు గురయ్యారని, అయితే ప్రభుత్వ వ్యవహారశైలిని చూస్తుంటే ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెచ్చేలా ఉందన్నారు. ఆడ బిడ్డలను అక్రమ కేసులతో జైలులో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే భాషనే కొంత మంది సామాన్యులు కూడా ఉపయోగిస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ చెప్పిన మొహబ్బత్ కి దుకాన్ ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. జనం నిలదీస్తే..ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపి జైలుకు పంపుతారా ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులతో వేధింపులకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపుతున్నందుకే యూట్యూబ్ జర్నలిస్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యమని పెద్దపెద్ద మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రజలు గొంతువిప్పితే మాత్రం తట్టుకోలేక పోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇకనైనా తన తీరును మార్చుకోవాలన్నారు. మీడియా గొంతు విప్పి సిఎం రేవంత్‌రెడ్డి అక్రమాలపై మాట్లాడాలన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేదాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కచ్చితంగా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో విఫలమైందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారని, రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని స్టేషన్ ఘన్‌పూర్‌లో చెప్పారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న అసమర్థ విధానాలవల్లే రాష్ట్ర ఆదాయం తగ్గిందన్నారు. తెలంగాణా రైసింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అని ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారని అన్నారు. తాము వచ్చాక తెలంగాణలో అన్నిరంగాలు చాలా బాగు న్నాయని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి మరి రూ.71 వేల కోట్ల ఆదాయం ఎలా తగ్గిందో చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ ముట్టడికి బిఆర్ఎస్ యువజన విభాగం యత్నం

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్శిటీలో ధర్నాలు, నిరసనలపై సర్కారు నిషేధం విధించడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడి యత్నం జరిగింది. ఓవైపు శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ బిఆర్ఎస్ యువజన విభాగం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గన్‌పార్క్ మీదుగా అసెంబ్లీ వద్దకు దూసుకువచ్చారు. అయితే ఆ సమయంలో అక్కడే బందోబస్తులో వున్న పోలీసులు వీరిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది.

చివరకు బిఆర్ఎస్ యువజన విభాగం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించా రు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఉస్మానియా యూనివర్శిటీలో ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడం అ న్యాయమని, ఇది విద్యార్థుల హక్కులను కాలరాయడమేనని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని, లేకుంటే తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు 574 మంది ఎంపిక

### ఫలితాలను ప్రకటించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సంక్షేమ వసతిగృహాల్లో.. ఖాళీగా ఉన్న 581 సంక్షేమ వసతి గృహాల అధికారుల పోస్టులకు ఎంపికైన అభ్య ర్థుల తుది జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) సోమవారం ప్రకటించింది. మొత్తం 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూవో) పోస్టులకి గానూ 574 మందిని ఎంపిక చేసినట్టు టిజిపిఎస్‌సి సోమవారం జారీ చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టులకు గతేడాది జూన్ 24 నుంచి 29 వరకు కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షలు (సీబీఆర్‌టీ) నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు 1,45,359 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 82,873 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 561 మంది హెచ్‌డబ్ల్యూవోలుగా ఎంపిక కాగా.. 13 మంది మాట్రిన్‌లు ఎంపికయ్యారు. మొత్తం 581 పోస్టులకిగానూ 574 మందిని ఎంపిక చేశారు.

## ఇక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీగా మార్పు

### బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన శాసన మండలి



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు సవరణ బిల్లును శాసనమండలి సోమవారం ఆమోదించింది. పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీ పేరు మార్పుకి సంబంధించిన సవరణ బిల్లును వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశ పెట్టారు. తెలంగాణ వైతాళికుడిగా పేరొందిన సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును తెలుగు వర్సిటీకి పెట్టనున్నట్టు ప్రతిపాదించారు. హైదరాబాద్ స్వదేశీ సంస్థానంలో నిజాంల పాలనలో తెలంగాణ ప్రాంతంలో స్వాతంత్ర్య సమరయోధుడిగా ఉన్నారని.. ఆంధ్రమహాసభకు మొదటి అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ సంస్థానంలో పలు తెలుగు ఉద్యమాలు, 1930లో జోగిపేట్‌నందు జరిగిన తెలుగు మహాసభను నిర్వహించారని గుర్తు చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి సామాజిక చరిత్రకారుడని, తెలంగాణ సాహిత్య మార్గదర్శకుల్లో ఒకరని.. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలోనూ ఆయన విద్వాంసుడని పేర్కొన్నారు. తెలంగాణ తెలుగుపట్ల మహోన్నతమైన గౌరవం కలవాడని తెలిపారు. తెలుగు ప్రజల ఉన్నతికి సేవ చేయటకు గోల్కొండ అనే తెలుగు పత్రికను హైదరాబాద్ సంస్థానంలో నెలకొల్పాడని తెలిపారు. 40కి పైగా పుస్తకాలను రాశారని.. ఆయన రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే పుస్తకం 1955లో కేంద్ర సాహిత్య అకాడీ అవార్డును సొంతం చేసుకుందని తెలిపారు. ఇంతటి చరిత్ర కలిగిన వ్యక్తి సురవరం ప్రతాప్‌రెడ్డి అని.. అందుకే తెలంగాణలో కొనసాగుతున్న శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చనున్నట్టు మంత్రి దామోదర తెలిపారు. అనంతరం బిల్లుపై బిఆర్ఎస్ సభ్యుడు దేశపతి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ చర్చలో పాల్గొన్నారు. అందరూ కూడా బిల్లుకు మద్దతు తెలిపారు. దీంతో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్టు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.



## కెటిఆర్, హరీశ్‌తో తీన్మార్ మల్లన్న భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 17:** అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ బహిష్కృత నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్), బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావుతో సోమవారం అసెంబ్లీలోని ఎల్పీ కార్యాయంలో భేటీ అయ్యారు. బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న మెమొరాండం అందించారు. అలాగే బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా ఢిల్లీ వేదికగా తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పార్టీ నేతలను కోరారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లుపై చర్చించారు. ఈ బిల్లుపై అసెంబ్లీలో బిసిల తరుపుల బిఆర్ఎస్ గళం వినిపించాలని కోరారు. బిసిలకు రిజర్వేషన్ పెంచేందుకు అసెంబ్లీలో బిఆర్ఎస్ నేతలు తమవంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై స్పష్టత కోసం సభ లో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. కాగా, పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో మల్లన్నను ఈ నెల 1న పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న పిసిసి క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని పేర్కొంది. తీన్మార్ మల్లన్న నుంచి ఎలాంటి వివరణ రాలేదు. అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.



భర్త, పిల్లలతో ప్రగతిరెడ్డి (ఫైల్)

## అమెరికా రోడ్డుప్రమాదంలో ముగ్గురు మృతి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మార్చి 17:** అమెరికాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనలో కొందుర్గు మండలం టేకులపల్లిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. టేకులపల్లి మాజీ సర్పంచ్ వెలువర్తి పవిత్ర మోహన్‌రెడ్డి చిన్నకూతురు ప్రగతిరెడ్డి (35), మనవడు హార్వీన్(6), ప్రగతిరెడ్డి అత్త సునీత (56)లు మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. ఈ ప్రమా దంలో ప్రగతిరెడ్డి భర్త రోహిత్‌రెడ్డి, చిన్నకుమారుడు(9 నెలలు) సురక్షితంగా ఉన్నారు. ఈ ప్రమాదవార్త సోమవారం ఉదయం తెలియడంతో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ వైస్ ఎంపిపి రాజేష్‌పటేల్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌కుమార్‌లతోపాటు వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు టేకులపల్లికి చేరుకొని మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శించారు.

## జూబ్లీహిల్స్‌లోని ఎంపి అరుణ ఇంటిని పరిశీలించిన కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 17, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని ఎంపీ అరుణమ్మ ఇంటిలో ఆగంతకుడు చొరబాటు విషయం నగరంలో సంచలనం రేకెత్తించిన విషయం విదితమే. ఈ విషయంలో యంపీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకు వెళ్లగా వెంటనే విచారణ జరపాలని సీయం నగర పోలీస్ కమీషనర్‌ను ఆదేశించారు. సోమవారం ఉదయం నగర పోలీసు కమీషనర్ సీవీ ఆనంద్ జూబ్లీహిల్స్‌లోని యంపీ ఇంటిని సందర్శించి ఆగంతకుడు ఇంటిలోకి ఎలా ప్రవేశించాడనే విషయమై పరిశీలన జరిపారు. వెంటనే ఈ విషయంలో విచారణ వేగవంతం చేసి నిందితుడి ఆచూకీ తెలుసుకుని అరెస్ట్ చేయాలని జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరిని ఆదేశించారు.

## బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న పలువురు సెలబ్రిటీలపై కేసు నమోదు

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 17, ప్రభాతవార్త:** బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న పలువురు సెలబ్రిటీలపై పంజగుట్ట పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం.. యూట్యూబ్‌లో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ అమాయకులను తప్పుదారి పట్టిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు వారిపై నిఘా పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎవరెవరు ఈ పనులకు పాల్పడుతున్నారో గుర్తించారు. ఈ క్రమంలో పలువురు ప్రముఖులు ఈ పనులకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో 11 మంది నటులు, ప్రభావితం చేసేవారు.. విష్ణుప్రియ, సుప్రీత, పరేషాన్ బాయ్స్ ఇమ్రాన్, హర్షసాయి, రీతుచౌదరి, టేస్టీ తేజ తదితరులపై కేసు నమోదు చేశారు. వీరంతా యూట్యూబ్‌లో ప్రముఖులుగా వెలుగొందుతున్నారు. వీరిపై పంజగుట్ట పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచేలా సర్కారును ఆదేశించండి

### గవర్నర్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు బడ్జెట్ పెంచేలా సర్కారును ఆదేశించేలా చూడాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి చేశారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమరయ్య సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత రావు, ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేశ్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన తర్వాత తొలిసారిగా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్‌కు విద్యారంగంతోపాటు టీచర్ల సమస్యలు విన్నవించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని.. టీచర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. రెండు రోజుల్లో సభలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కోఠారి కమిషన్ నివేదిక ప్రకారం .. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకి మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని.. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని.. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, బిల్లులను ప్రభుత్వం వెంటనే క్లియర్ చేసేలా ఆదేశించాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు, హెల్త్ కార్డులు, పదోన్నతులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వాటితోపాటు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ జరిగేలా చూడాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేలా సర్కారును ఆదేశించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్‌కి విజ్ఞప్తి చేశారు.

## ముంబయి విమానాశ్రయంలో కస్టమ్స్ దాడులు

### రూ.8.47 కోట్ల బంగారం జప్తు.. ఐదుగురి అరెస్టు



ముంబయి విమానాశ్రయంలో పట్టుబడిన బంగారం

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్ ఆగడం లేదు. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం లో కొందరు ప్రైవేటు ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో రెండు రోజుల పాటు పక్కా నిఘా వుంచిన కస్టమ్స్ అ ధికారులు నాలుగు వేరు వేరు చోట్ల దాచివుంచిన పది కిలోలకు పైగా బంగారాన్ని పట్టుకున్నారు. ఈ వివరాలను కస్టమ్స్ అధికారులు సోమవారం నాడు మీడియాకు వెల్లడించారు. ఈ దాడులు ఈ నెల 13, 15వ తేదీల్లో జరిగాయని వారు వివరించారు. బట్టలు, లో దుస్తుల్లో కొందరు దాచి విదేశాల నుంచి స్మగ్లింగ్ చేసినట్లు తేలిం దని వారు తెలిపారు.

మొదటి ఘటనలో ప్రైవేటు ఎయిర్ లైన్స్ ఉద్యోగి 24 క్యారట్‌ల 2.8 కిలోల బంగారాన్ని మైనం రూపంలో దాచి ప్యాంటు జేబులో వుంచుకుని బయటకు వస్తుండగా పట్టుబడ్డాడు. ఈ బంగారం విలువ 2.27 కోట్ల రూపాయలు. మరో ఘటనలో మరో ప్రైవేటు ఎయిర్ లైన్స్ ఉద్యోగి డిపార్చర్ గేట్ వద్ద 2.9 కిలోల బంగారాన్ని లోదుస్తుల్లో దాచి వుంచి తెస్తుండగా పట్టు బడ్డాడు. దీని విలువ 2.36 కోట్ల రూపాయలుగా తేలింది. మూడవ ఘటనలో మరో ప్రైవేటు ఎయిర్ లై న్స్ ఉద్యోగి 1.6 కిలోల బం గారాన్ని మైనం రూపంలో లో దుస్తుల్లో దాచి తెస్తుండగా ప్రధాన ద్వారం వద్ద పట్టుబడ్డాడు.

దీని విలువ రూ. 1.31 కోట్లు. కాగా నాలుగవ ఘటనలో విమానాశ్రయంలో నిలిచి వున్న విమానం వాష్ రూంలో రెండు నలుపురంగు బ్యాగుల్లో 3.1 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. దీని విలువ రూ. 2.53 కోట్లు. మొదటి మూడు ఘటనల్లో ముగ్గురు అరెస్టు కాగా నాలుగో ఘటనలో మరో ఇద్దరు అరెస్టయ్యారు. బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన ఐదుగురిపై కస్టమ్స్ చట్టాలకింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఆర్టీసి బస్సు ఢీకొన్న కారు

### తాతమనవడు మృత్యువాత

### కారుటైర్ పగలడంతో ప్రమాదం

### మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17, ప్రభాతవార్త:** కారు టైర్ పగిలి అదుపుతప్పడంతో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో తాత మనవడు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని మాచారం వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రేమ నగర్ కాలనీకి చెం దిన వెంకటరెడ్డి (70) టూన్ను (20) మున్నీ అనే ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ కు కారులో బయలు దేరారు. ఈ క్రమంలోని జడ్చర్ల మండలం మాచారం వద్దకు రాగానే కారు టైర్ పగలడంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుంటూ హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో కారు పూర్తిగా కావడంతో కారులో వెంకటరెడ్డి, టూన్ను, తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో కారులో ఇరుక్కున్నారు. గమనించిన స్థానికులు ప్రయాణికులు కారులో ఇరుక్కున్న వెంకటరెడ్డి, టున్నులను అతి కష్టం మీద బయటకు తీశారు. అప్పటికే స్పృహ కోల్పోయి ఉండటంతో వారిని 108 సహాయంతో జిల్లా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనలో గాయపడిన టూన్ను తల్లికి చికిత్స అందిస్తు న్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు జడ్చర్ల పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.

-షేక్‌స్పియర్

# వేసవి ప్రతాపం

దేశంలో పలు చోట్ల సగటు పగటి ఉష్ణోగ్రతలు చూస్తే తట్టుకోలేని విధంగా ఉండి భగభగలు మొదలయ్యాయి. తెల్లవారుఝాము నుంచే వేడి గాలులు విపరీతంగా వీస్తున్నాయి. జనం ఉక్కపోతకు ఇబ్బందిపడుతున్నారు. దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ వేసవి తీవ్రత హెచ్చుగానే ఉంది. అన్ని నగరాల్లోనూ రోడ్లు నిర్మానుష్యంగా ఉండటానికి కారణం ముందుగా వచ్చిన ఎండలు. ఆదివారం నుంచి ఎండల తీవ్రత పెరిగింది. చాలా ప్రాంతాల్లో 42 డిగ్రీల సెలియస్ కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదవుతుందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. కాలం కాని కాలం అని కాదు గాని గత యేడాది ఇదే నెలలో ఉష్ణోగ్రతలు ఏస్థాయిలో ఉన్నాయో పోల్చిచూసుకుంటే ఈసారి గ్రీష్మతాపంముందే ప్రవేశించింది. నిద్ర లేచే సరికే ఉష్ణతాపం శరీరాన్ని తాకుతోంది. ఉదయం 8 గంటలు దాటితే బయటకు వెళ్లే ఛాన్స్ కనపడటం లేదు. మానవాళికి ఈ యేడాది ఎండా కాలం తిప్పలేతిప్పలు. మూగజీవాలు సైతం ఎండలకు బెదురుతున్నాయి. దోమల నుండి కాపాడడానికో, శీతాకాలం చలి నుండో కాపాడటానికో పశువులపై పెద్దపెద్ద దుప్పట్లు కప్పడాన్ని గ్రామ సీమల్లో గమనిస్తుంటాము. కాని ఎండ ధాటి నుంచి కాపాడడానికి మూగజీవులకు ప్రత్యామ్నాయం లేదు. సేద తీరేందుకు పశువులు చెట్ల చెంతన చేరుతున్నా వాటికి తగిన ఊరట లేక విలవిల్లాడుతున్నాయి. ఉదయాన్నే మేతకు వెళ్లిన ఆ మందల్ని గమనిస్తే గత మూడు రోజులుగా ఎండలకు ఉపశమనం దక్కక వగరుస్తూ ఇంటి దారిపడుతున్నాయి. ఎండల తీవ్రత గురించి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా హెచ్చరికలను అందచేస్తూనే ఉంది. కానీ రోహిణీకార్తె ఇప్పుడప్పుడే కాదుగా, అనే ధోరణిలో జనం రోడ్డు మీదకు వచ్చేస్తున్నారు. దాంతో చాలామంది ఉడుకు జ్వరాలతో బాధపడుతున్నారు. తెలుగు రాష్ట్రా లలో ఇప్పటికే 49 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రత పెరిగిపోయింది. కొన్ని జిల్లా ల్లో వడగాలులు వీచుతున్నాయని సమాచారం. హైదరా బాద్‌లో అటు ఆంధ్రప్రదేశ్‌లో వీస్తున్న వడగాలుల పట్ల జనం ఆందోళన పడ్తున్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు తెలంగాణలో ఓ మాదిరి వానలు పడతాయని భవిష్యత్ వర్ణచిత్రాన్ని వాతావరణశాఖ పేర్కొంది. అయినా ఈ లోగా వచ్చే వడగాలులను తట్టుకోవడమెలా? అనే ఆలోచనలో జనం ఇంటిబయటకు రాకుండా ఇంట్లోనే కాలక్షేపం చేస్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే పరిస్థితి వలన తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిప్పులకొలిమి వాతావరణ కన్పిస్తోంది. రానున్న మూడు రోజుల్లో ఎండల తీవ్రత, వడగాల్పుల సంకేతాలు జనాన్ని బిక్కుబిక్కుమనే పరిస్థితిలోకి నెట్టి వేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజానీకం అనారోగ్యాన్ని ఆహ్వానించకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 1901 తర్వాత అత్యంత వేడిమిగల మాసంగా ఈ యేడాది ఫిబ్రవరి నెలను గుర్తించారు. ఇలాంటి కారణాలతో ఆయారాష్ట్రాలలో ఎండల తీవ్రతకు ఎండిపోయిన పంటల వివరాలను వ్యవసాయశాఖ రూపొందిస్తున్నా వాటివలన ఎలాంటి పరిహారమూ దక్కే పరిస్థితి ఉండదు. శివరాత్రి వచ్చిందనగానే శీతాకాలం వెళ్లి ఎండా కాలం వచ్చిందనే సంకేతాలు చెప్పుకుంటాము. అయితే ముందస్తు వేసవిలో భూగర్భజలాలు ఎండిపోయాయి. మార్చిలోనే వేసవి ప్రతాపం చూపెడుతుండడంతో కీలక దశలో ఉన్న పలు పంటలు మీద ప్రభావం పడింది. బావులు, బోర్లు, చెరువులు ఎండిపోయాయి. యాసంగి పంటలపై వేసవి ప్రతాపంవల్ల దిగుబడులు తగ్గుతాయని రైతాంగంలో ఆందోళన బయలుదేరింది. తెలంగాణలో దాదాపు 30లక్షల బోర్లు ఎండిపోయాయని అంచనా. ఆదిలాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 40.8 డిగ్రీల సెల్సియస్ మేరకు నమోదైంది. హైదరాబాద్‌లో గాలిలో తేమ 24శాతానికి పడిపోయింది. దాంతో జనం ఉక్కపోతకు గురయ్యారు. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయనే అంచనాతో ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చాలాకేంద్రాల్లో ఆది,సోమ వారాల్లో 42డిగ్రీల ఉష్ణోగ్రతను దాటి నమోదయింది. అనకాపల్లి జిల్లా నాతవరంలో ఆదివారం అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకోగా, రాష్ట్రంలోని 20 మండలాల్లో ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో తీవ్ర వడగాల్పులు వీచాయి. అంటే సాధారణ స్థాయి కన్నా 2,3డిగ్రీలు ఎక్కువే. ఎల్‌నినో పరిస్థితుల రీత్యా సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో భవిష్యత్ రోజుల్లో ఎండ, వడగాల్పులు తీవ్రత వేధిస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నిలో కారణంగా గత యేడాదికన్నా ఈ యేడాది వేసవికాలం 'వేడిమి' కాలంగా మారుతుంది. వర్షపాతం బాగాతగ్గి వేసవి ఉష్ణోగ్రతలను పెంచుతుంది. దక్షిణ భారతదేశంలో వర్షాలు బాగా తగ్గిపంటలు, నీటి వనరుల మీదప్రభావం చూపిస్తుంది. తీవ్ర వేసవి ప్రభావంవలన పిల్లలు వృద్ధులు ఇంట్లోంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉత్తరభారత దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయటికి తిరగవద్దని, నీళ్ల అధికంగా తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. మార్చి20 వరకు ఉత్తర తెలంగాణలో వడగాల్పుల స్థాయి తీవ్రత హెచ్చుగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆయా ప్రాంతాలలో మధ్యాహ్నం 11గంటల నుంచి 3.30వరకు బహిరంగ ప్రదేశాల్లో జనసంచారంకూడదని సూచిస్తోంది. మార్చి 21నాటికి అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత వచ్చే వడగాలులను తట్టుకునేందుకు వీలుగా ప్రజలు సిద్ధం కావాల్సిన అవసరముంది.

పుస్తకాలు అనే దీపాల వెలుగులోనే మనో మాలిన్యం అనే చీకటి తొలగిపోతుంది.



అంబేద్కర్

ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతులు నిష్పత్తినిబట్టి బీదవారుగాని, ధనవంతులుగాని అవుతారు.



జాన్సన్

# రాజధానికి 'రక్షణ' అవసరం

**ప్రస్తుతం అమరావతికి రక్షణ కల్పించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేతిలోఉంది. చెన్నై నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి అమరావతికి, అమరావతి నుంచి మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నం,విశాఖపట్నం నుంచి మళ్లీ అమరావతి అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని పరిస్థితి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ పరిణామాలన్నీ పరిగణనలోకి తీసుకుని పార్లమెంటు ఉభయ సభల మద్దతుతో అమరావతి రాజధానిని రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా గుర్తించి, భవిష్యత్తులో రాజధాని మార్చాలంటే కచ్చితంగాపార్లమెంటు ఉభయ సభల మద్దతు అవసరం అనేటట్లు కేంద్ర ప్రభుత్వం గెజిట్ తెస్తేనే అమరావతికి రక్షణ ఏర్పడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.**

కైలసాని శివప్రసాద్

విభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నూతన రాజధాని నిర్మించే బృహత్తర అవకాశం రావడాన్ని 2014 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సవాలుగా స్వీకరించారనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచంలోని ప్రముఖ అయిదు నగరాలలో అమరావతిని ఒకటిగా నిలపాలనే బృహత్తర సంకల్పంతో చంద్రబాబు నాయుడు రాజధాని నిర్మాణానికి కంకణం కట్టుకున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామాత్యులు నారాయణ ఇటీవల వెల్లడించడం గమనార్హం. రాజధాని కొరకు దేశంలో ఎక్కడా జరగని విధంగా స్థానిక రైతులనుంచి నామ మాత్రపు వ్యతిరేఖత కూడా లేకుండా 34వేల ఎకరాల సారవంతమైన భూమి లాండ్ పూలింగ్ ద్వారా రాష్ట్రప్రభుత్వం అప్పట్లో సేకరించడం విశేషం. చంద్రబాబు నాయుడిపై ఉన్న ఆచంచలమైన విశ్వాసంతోనే సంవత్సరానికి మూడు పంటలు పండే వేల ఎకరాల భూమిని రైతులు రాజధాని కొరకు స్వచ్ఛందంగా ఇచ్చారనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజధాని కొరకు భూమిని సేకరించిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికారసంస్థ (ఏ.పి.సి.ఆర్.డి.ఎ)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సి.ఆర్.డి.ఎకు భూసేకరణ, రాజధాని నిర్మాణపు బాధ్యతలతో పాటూ రాజధాని పరిధిలో విస్తృతమైన అధికారాలు కల్పిస్తూ ప్రత్యేక చట్టంప్రభుత్వం రూపొందించింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన దూరంలో మధ్యస్తంగా ఉండే యన్.టి.ఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన 58మండలాలు,3 మున్సిపల్ కార్పొరేషన్లు,10 మున్సిపాలిటీలు, 1006 గ్రామ పంచాయితీలలోని 8603 చదరపు కిలోమీటర్లను సి.ఆర్.డి.ఎ పరిధిలోకి ప్రభుత్వం తీసుకువచ్చింది. అందులో 217.23 చదరపు కిలోమీటర్ల అమరావతి రాజధాని ఉండడం గమనార్హం. భూసేకరణ కార్యక్రమం పూర్తి అయిన వెంటనే రాజధాని నిర్మాణపు నమూనా పరిశీలన కొరకు చంద్రబాబు నాయుడు అనేక దేశ రాజధానులు స్వయంగా సందర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకరంగా భావించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణపు నమూనాను సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూపకల్పన చేయించారు. రాజధాని నిర్మాణపు నమూనా అధికారికంగా ఆమోదం పొందిన తరువాత 2015 అక్టోబర్ 22 విజయదశమి రోజున ఉద్దండరాయునిపాలెంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా అమరావతి రాజధాని శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహింపబడింది. ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక పరిపాలన, శాసనసభ, శాసనమండలి భవనాలకు 2016జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంఖుస్థాపన చేశారు.2017 జూలై 1నుంచి రాష్ట్రముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు పాలన ప్రారంభించడం జరిగింది. శాసనసభ, శాసనమండలి సమావేశాల నిర్వహణ కూడా అక్కడినుంచే ప్రారంభింపబడ్డాయి. సచివాలయం, అసెంబ్లీ, రాష్ట్ర హెచ్.ఒ.డిలలో విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌తో దశాబ్దాల అనుబంధాన్ని ఏర్పరచుకున్న ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి అవాంతరాలు సృష్టించకుండా అమరావతి రాజధాని ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. దేవాదాయ శాఖ, ఏపీఐఐసి లాంటి అనేకశాఖల రాష్ట్ర ప్రధాన కార్యాలయాలకు సొంత భవన నిర్మాణాలు పూర్తయ్యాయి.ఆ శాఖల అధికారిక కార్యకలాపాలన్నీ ఆ భవనాల నుంచే ప్రారంభమయ్యాయి. 2019 ఫిబ్రవరి 3న దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ హై కోర్టు భవనాలు కూడా ప్రారంభింపబడ్డాయి. అదేసమయంలో న్యాయమూర్తులు, మంత్రులు, శాసనసభ్యులు. ఉన్నతాధికారుల వేలాది నివాస వసతుల భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ భవనాలన్నీ నిర్మాణపు చివరి దశకు చేరుకున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలు రావడం ఆ 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం



కోల్పోయి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం జరిగింది. జగన్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే గతంలో చంద్రబాబు కోట్లాది రూపాయల ప్రజాధనంతో కరకట్టపై నిర్మించిన ప్రజావేదిక భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారనే నెపంతో అదే ప్రజాధనంతో నేలమట్టం చేశారు. కరకట్టపై ఉన్న అక్రమ కట్టడాలతో పాటూ రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఇతర ప్రభుత్వ భూములలో నిర్మించిన అక్రమ కట్టడాలను కచ్చితంగా నేలమట్టం చేస్తారని జగన్ విశ్వసనీయతను గొప్పగా ఊహించుకొని ఓట్లేసి అధికారం అప్పగించిన రాష్ట్ర ప్రజలు భావించారు. కానీ ప్రజల ఆశలను జగన్ మోహన్ రెడ్డి అడియాశలు చేయడం గమనార్హం. అదేవిధంగా ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీ సాక్షి గా అమరావతి రాజధాని నిర్మాణానికి తన సంపూర్ణ మద్దతు తెలిపిన జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాజధాని పై యూటర్న్ తీసుకుని మూడు రాజధానుల ముచ్చట ఎత్తుకోవడం యావత్ రాష్ట్ర ప్రజలను షాక్‌కు గురిచేసింది. జగన్ మోహన్ రెడ్డి చేసిన మూడు రాజధానుల ప్రకటన హైదరాబాద్‌తో సుదీర్ఘకాల బంధాన్ని, అనుబంధాన్ని వదలుకొని వచ్చి అప్పుడే రాజధాని ప్రాంతంలో స్థిరపడతున్న ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కానీ అయిదు సంవత్సరాల పాలనా కాలంలో మూడు రాజధాను లపై ఒక్క అడుగు కూడా సానుకూలంగా ముందుకు పడిన దాఖలాలు లేవు.గతంలో ప్రతి పక్ష నేత హోదాలో అసెంబ్లీ సాక్షిగా అమరావతి రాజధానికి జైకొట్టిన జగన్ అధికారం లోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో నై అనడానికి ఒక్కో పర్యాయం ఒక్కో కారణం చెప్పడం ఆశ్చర్యకరం. అయిదు సంవత్సరాల కాలంలో రాజధాని భూముల విషయంలో టిడిపి నేతలు చేసిన ఒక్క అక్రమం కూడా ఎందుకు రుజువు చేయలేక పోయారో వై.యస్.ఆర్.సి.పి నేతలకే తెలియాలి. అమరావతి కాదు, భ్రమరావతి అంటూ ఒకదశలో రాజధానిని కుల రాజధానిగా చిత్రీకరించేందుకు ఫ్యాన్ పార్టీ నేతలు విశ్వప్రయత్నాలు చేశారు. కొందరు వై.సి.పి నేతలైతే ఏకంగా రాజధాని ప్రాంతంలో చంద్రబాబు స్వీయ సామాజిక వర్గంవారు ఎక్కువగా ఉన్నారు. వారికి లబ్ధి చేకూర్చేందుకే చంద్రబాబు అక్కడ రాజధానికట్టాలని ప్రయత్నించారని వ్యాఖ్యలు చేశారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి ఏమాత్రం అనుకూలం కాదు, ఆప్రాంతమంతా మునక ప్రాంతం అని కూడా వై.సి.పి నేతలు వ్యాఖ్యానించారు.వాస్తవంగా అమరావతిప్రాంతం కొత్తగా పుట్టుకొచ్చింది కాదు. అక్కడ వేలాది కుటుంబాలు తరతరాలుగా స్థిరపడి ఉన్నాయి.వారిలో అనేక కుటుంబాల వారు పటిష్టమైన భారీ భవంతులు ఆప్రాంతంలో నిర్మించుకుని ఉన్నారు.నిజంగా అమరావతి మునక ప్రాంతమైతే వారి పరిస్థితిఏంది ? జగన్ మోహన్ రెడ్డితోపాటూ వై.సి.పి నేతలు అనేకమంది రాజధాని ప్రాంతంలో విలాసవంతమైన బంగ్లాలు,విల్లాలు సొంతంగా నిర్మించుకుని ఉన్నారు. అదేవిధంగా ఆప్రాంతాన్ని శాసన రాజధానిగా జగన్ ప్రకటించారు. దీని అర్థం ఏంది ? అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించాలంటే లక్షలాది కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది, సమయంకూడా ఎక్కువ తీసుకుంటుంది అందువలన విశాఖపట్నం నుంచి పరిపాలన సాగిస్తామని జగన్ మోహన్ రెడ్డి మరో కారణం తెరపైకి తేవడం రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేసింది.జగన్ ప్రకటించినట్లుగానే విశాఖపట్నంలోని రుషికొండపై నుంచి పాలన సాగించాలనే ఉద్దేశంతో జాతీయ పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా సుమారు ఆరు వందల కోట్ల రూపాయలతో పాలస్‌లు నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం అమరావతికి రక్షణ కల్పించవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వం చేతిలోఉంది. చెన్నై నుంచి కర్నూలుకు,కర్నూలు నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి అమరావతికి, అమరావతి నుంచి మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి మళ్లీ అమరావతి అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని పరిస్థితి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ పరిణామాలన్నీ పరిగణనలోకి తీసుకుని పార్లమెంటు ఉభయ సభల మద్దతుతో అమరావతి రాజధానిని రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా గుర్తించి, భవిష్యత్తులో రాజధాని మార్చాలంటే కచ్చితంగాపార్లమెంటు ఉభయ సభల మద్దతు అవసరం అనేటట్లు కేంద్ర ప్రభుత్వం గెజిట్ తెస్తేనే అమరావతికి రక్షణ ఏర్పడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ●

# దేశ భద్రతకు ఆయుధ కర్మాగారాల భరోసా

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత దేశంలో మార్చి 18వ తేదీని ఆయుధ కర్మాగారాల దినోత్సవంగా జరుపుకుంటారు. దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల పాత్రను గుర్తించడంతో పాటు, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. 1801వ సంవత్సరం మార్చి 18వ తేదీన కోల్‌కతాలోని కాస్‌సిపూర్ వద్ద మొదటి ఆయుధ కర్మాగారాన్ని స్థాపించారు. భారత రక్షణ సామర్థ్యంలో ఒక కొత్త దశకు నాంది పలికింది. అప్పటి నుండి, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అనేక ఆయుధ కర్మాగారాలు ఏర్పడ్డాయి. ఈ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తయారు చేస్తాయి. ఈ కర్మాగారాల అభివృద్ధి అనంతర కాలంలో భారత రక్షణ వ్యవస్థను మరింత బలపరిచింది. 2021వ సంవత్సరం అక్టోబరు 1వ తేదీ నుండి, భారత ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును ఏడు ప్రభుత్వ రంగసంస్థలుగా మార్చింది. ప్రస్తుతం ఇవి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ బోర్డ్ ఆధ్వర్యంలో పని చేస్తున్నాయి. ఈ కర్మాగారాలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. భారత దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ఈ కర్మాగారాలు సహాయ పడతాయి. ఈ కర్మాగారాలు అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. భారత దేశం రక్షణ



అవసరాలను తీర్చడంలో ఆయుధ కర్మాగారాలు చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఆయుధ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండ్లు, యుద్ధ సామగ్రి, రక్షణ పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు మొదలైన వాటిని తయారు చేస్తుంటాయి. ఇవి దేశ భద్రత కోసం అందించే సేవలు ఎంతగానో విలువైనవి. ఈరోజున, ఆయుధ కర్మాగారాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయుధ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు వంటివి నిర్వహిస్తారు. ఈ వేడుకలలో ఆయుధ కర్మాగారాల ఉద్యోగులు, అధికారులు ఇతరులు పాల్గొంటారు. యువతలో రక్షణ రంగం పై ఆసక్తిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విధంగా ఆయుధ కర్మాగారాల దినోత్సవం దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల ప్రాముఖ్యతను తెలియ జేస్తుంది. దేశ భద్రతను సుస్థిరంగా నిలుపు కోవడంలో ఆయుధ కర్మాగారాలు వహిస్తున్న పాత్ర అమోఘం. ప్రస్తుత యుగంలో విదేశీ ఆయుధాల మీద ఆధార పడకుండా స్వదేశీ తయారీకి ప్రాధాన్యత ఇచ్చే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసు కుంటోంది. ఆయుధ నిర్మాణంలో స్వయం సమృద్ధిని సాధించాలన్న ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి ఇది ప్రేరణగా నిలుస్తుంది. ●



# ప్రజావాక్కు

### దుర్భాషలాడటం మానుకోవాలి

గతఆంధ్రప్రదేశ్‌వై.ఎస్.ఆర్.సి.పి.ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, లెజిస్లేటర్లు అసెంబ్లీలోనూ, బయట ప్రతిపక్ష నాయకులను దుర్భాషలతోఅమితంగా దూషించడం టీవీల్లో చూసాం.పేపర్లలో చదివాం.ఇప్పుడు అవే అవమానకరమైన మాటలు తెలంగాణాలోనూ వినిపిస్తున్నాయి. కె.సి.ఆర్. రేవంత్‌రెడ్డి అనరాని మాటలు అన్నారని, దానికి అదేస్వరంతో అటువంటి భాషతోనేబదులిచ్చారని వార్తలు వచ్చాయి. అన్ పార్లమెంటరీ పదాల లిస్టును తయారు చేసి వాటిని ఎట్టి పరిస్తుతులలోనూ చట్ట సభలలోనూ, బయట మాట్లాడకూడని ఓ నిర్ణయం తీసుకుంది. ఎవరికి గుర్తుంది? గుర్తున్నా అసభ్యపు మాటలు మాట్లాడకుండా ఉంటున్నారా? సభ్యసమాజం మాత్రంసిగ్గుతో తలదించుకుంటోంది. దుర్భాషలాడటం మానుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

### బెలూచిస్థాన్‌పై పాకిస్థాన్ కన్ను

పాకిస్థాన్ ఆర్మీ పైన బెలూచి లిబరేషన్ ఆర్మీ చేసే పోరాటం, అసమానతలు అభివృద్ధికి దూరంగా ఉంచడం వల్ల పుట్టిన ఉద్యమంగా అర్థం చేసుకోవాలి. విలువైన అపురూపమైన ఖనిజ సంపదకు నిలయం అయిన ఈ బెలూచిస్తాన్ ప్రాంతం పైనపాకిస్థాన్ ప్రభుత్వం కావాలనే అభివృద్ధికి దూరంగా ఉంచి అక్కడివిలువైన సంపదను మాత్రం వాడుకుంటూఉంది. ఇది అక్కడి ప్రజలలో కోపానికికారణమైంది. మనం ఇదేతరహా విధానాన్ని ప్రపంచంలోని చాలా ఉద్యమాల్లో చూడొచ్చు. సమాన అభివృద్ధితోనే సమగ్ర అబివృద్ధి సాధ్యం అనే నానుడిని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలి.

-భారత అవినాష్, జనగామ

### ఎయిర్‌పోర్టుకు కోమరంభీమ్ నామకరణం

ఎన్నో ఏళ్లుగా ఆదిలాబాద్ జిల్లావాసుల ఆకాంక్షల మేరకు ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో విమానాశ్రయం నిర్మించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం హర్షించదగ్గ విషయం. దీనివలన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి చెందుతుంది.దేశ,అంతర్జాతీయ నాయకులపేర్లతో ఎయిర్ పోర్టులు నిర్మించడం జరుగుతుంది. కావున ఆదిలాబాద్‌లో నిర్మించే ఎయిర్ పోర్ట్‌కు గిరిజన యోధుడు కొమురం భీమ్ ఎయిర్ పోర్ట్ గా నామకరణం చేయాలి.

-ఆళవందార్ వేణు మాధవ్, హైదరాబాద్

### సెకి విద్యుత్ కొనుగోలు ఒప్పందం!

రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వం 2021వ సంవత్సరంలో సెకి సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై తెలుగుదేశం పార్టీ పిల్లిమొగ్గలు వేస్తున్న వైనం విస్తుగొల్పుతోంది.ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒప్పందాన్ని రద్దు చేసుకోలేమని అది ప్రభుత్వ విశ్వసనీయతకు భంగకరం అవుతుందని చట్టసభలో సెలవు ఇచ్చారు. ఇదే తెలుగుదేశం పార్టీ ఒప్పందంప్రకారం విద్యుత్ కొనుగోలు ధర అధికంగా ఉందని, అందువల్ల రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఒప్పందానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.విద్యుత్ కొనుగోలు ధరఅధికంగా ఉన్నమాట నిజం. ఒప్పందం అమలు జరిగితే రాష్ట్ర ప్రజలపై ఒక లక్ష పదివేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుంది. తెలుగుదేశం పార్టీ కోర్టుకి పోయింది కూడా ఇదే అంశంపై! కోర్టులో కేసు ఇంకా పరిష్కారంకాలేదు.ఇక్కడ సెకిసంస్థ కేంద్రప్రభుత్వ సంస్థ మాత్రమే.అది ఏ విదేశీ సంస్థో అయితే చంద్రబాబు గారు చెప్పినట్లు ప్రభుత్వ విశ్వసనీయత ప్రశ్నార్థకం అవుతుంది.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### జ్ఞానానికి ప్రాముఖ్యమిద్దాం

పాఠశాలల్లో కుల మత బేధాలను చూపొద్దు. విద్య అందరి హక్కు. జ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలి అంటూనే ఉద్యోగాల్లో మాత్రంకులం కండిషన్స్ పెట్టడం ఎందుకు? జ్ఞానాన్ని దృష్టిలో ఉంచకోకుండా కేటగిరి బట్టి ఉద్యోగలిస్తున్న రోజులివి జ్ఞానానికి ప్రాముఖ్యం ఇచ్చి అసమానత్వంను నిర్మూలించిన ప్పుడే విద్యార్థుల చదువుకి తగ్గప్రతిఫలం లభిస్తుంది న్యాయం గెలుస్తుంది.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

### తూకాలలో మోసాలు ఆగేదెలా

రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలోని కూరగాయల మార్కెట్లు, రోడ్ల వెంబడి అమ్మే కూరగాయల మార్కెట్,చేపల మార్కెట్, చికెన్,మటన్ విక్రయించే షాపులలో తూకంలలో భారీ మోసాలు జరుగుతున్నాయి.దీని వల్ల వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు.ఒక కిలోకూరగాయలు కొన్న ఎనిమిది వందల గ్రాములు వస్తున్నాయి.వారు పెట్టె తూకం బాట్లు కిలో వుండడం లేదు.ఎలెక్ట్రానిక్స్ కాంటాలో కూడా మోసం చేయడం జరుగుతుంది.సంబధిత అధికారులు మామూళ్ల మత్తు లో పడి వారిమీద చర్యలు తీసుకోవడం లేదు..

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

# పెట్టుబడిదారీ విధానానికి పరాకాష్ఠ

డా. ఎస్. తిరుపతయ్య

భారతదేశంలో ఫాసిస్టు పాలన నడుస్తున్నదా లేదా అనే విషయంలో చాలామంది గందరగోళ పడుతున్నారు. నిజంగా ఈరోజు మనదేశంలో అటువంటి పాలన అమలవుతున్నదో లేదో తెలియాలంటే అసలు ఫాసిజం అంటే ఏమిటో తెలియాలి. ఫాసిజం నిర్వచనం కంటే ఫాసిజం ఒక దేశంలో ఏ పరిస్థితులలో తలెత్తుతుంది, దానికి కారణమయ్యే నిర్ణయాత్మక శక్తులు ఏమిటి? అనే విషయాలలో కూడా ప్రపంచవ్యాప్తంగా మార్క్సిస్ట్ శిబిరంలోనే తీవ్రమైన భిన్నాభిప్రాయాలున్నాయి. ఫాసిజం రావాలి అనంటే పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉండాలి అని కొంతమంది అన్నారు. ఒక దేశం సామ్రాజ్యవాద దశలోనే ఫాసిజం తలెత్తుతుందని మరి కొంతమంది అన్నారు. కొంతమంది ఇది పెట్టుబడిదారీ విధానానికి పరాకాష్ట అనీ, మరి కొంతమంది అలా కాదు ఇది పెట్టుబడిదారీ విధానంలో ఒక డీవియేషన్ మాత్రమేనని, తిరిగి ఆ పక్కదారి నుండి మళ్లీ పెట్టుబడిదారీ విధానపు సాధారణ ఉదారవాద ప్రజాస్వామ్యంలోకి వచ్చి చేరుతుందని, ఇలా అనేక రకాల అభిప్రాయాలు చెప్పారు. ఇంత భిన్నాభిప్రాయాలు తలెత్తటానికి కారణం అన్ని దేశాల్లో ఒకే రకమైన భౌతిక పరిస్థితులు, ఒకే రకమైన నిర్ణయాత్మక శక్తులు లేకపోవటమే. ఈ నేపథ్యంలో భారతదేశంలో తలెత్తిన ఫాసిజం యూరప్ దేశాల్లో తలెత్తిన ఫాసిజంకు నిజప్రతిలాగా ఉండదనీ, ఇక్కడి పరిస్థితులు, కారకాలు వేరుగా ఉండగలవనే స్పృహతో ఇక్కడ ఫాసిజంను అర్థం చేసుకోవాలి. అలాగే ఫాసిజం అమలైన అన్ని దేశాల్లోనూ అది ఒకే తీవ్రతతో లేదు, ఒకే రూపంలో కూడా లేదు. భారతదేశంలో పాసిజంను అర్థం చేసుకునేటప్పుడు ఈవిషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. నిర్వచనం ఎలాఉన్నా ఫాసిజం అమలైన ఇటలీ,జర్మనీ,స్పెయిన్, ఇంకా ఫాసిజం పొడచూపిన అనేక ఇతర దేశాలలో ఫాసిజపు తీరు తెన్నులలో కొన్ని ఉమ్మడి లక్షణాలున్నాయి. వాటినే ఫాసిజం మౌలిక లక్షణాలు అనవచ్చు. వాటి ద్వారానే అసలు ఫాసిజం అంటే ఏమిటో, అది భారతదేశంలో అమలవుతున్నదా లేదా అనే విషయాన్నీ మనం గ్రహించవచ్చు. ఫాసిజపు మౌలిక లక్షణాలు ఇలా ఉన్నాయి. ఫాసిస్టు విధానాన్ని అమలుపరిచే పార్టీ కూడా అప్పటివరకు అమలైన రాజ్యాంగ పరిధిలో, ప్రజాస్వామ్య విధానంలోనే ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వస్తుంది. అంతే కానీ పార్లమెంటేతర మార్గాలలో తిరుగుబాట్ల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోదు. ఇలా ఫాసిస్టుపార్టీ అధికారంలోకి రావటం చాలా నిశ్శబ్దంగా, ఇది సాధారణ అధికార మార్పిడే కదా అన్నట్లే జరుగుతుంది. ఫాసిజంలో రాజ్య నియంత్రిత్వ పరిపాలన ఉంటుంది. అంటే, ఉదారవాద ప్రజాస్వామ్య పరిపాలనా విధానం కూడా రద్దవుతుంది. పార్లమెంటు తన నిజ అర్థంలో పనిచేయదు. రాజ్యానికి అవసరమైన విషయాల్లో తప్ప రాజ్యాంగం ప్రజలకు అవసరమైన విషయాల్లో వినియోగించబడదు. స్వతంత్రంగా పని చేయాల్సిన సంస్థలైన కోర్టులు, ఎన్నికల కమిషన్, ఇతర రాజ్యాంగ సంస్థలన్నీ పూర్తిగా రాజ్యం చెప్పు చేతుల్లోకి వెళ్తాయి. ప్రతిపక్షాలకు విలువ ఉండదు. మీడియాకు స్వతంత్రత ఉండదు. ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాచి వేయబడుతుంటాయి. ఒకే ఒక పార్టీ అధికారంలో ఉండాలంటారు, ఆ పార్టీలోని ఫలానా బలమైన నాయకుని పరిపాలనలోనే దేశమంతాఉండాలి అంటారు. ఇది రాజ్య నియంత్రిత్వం (స్టేట్ డిక్టేటర్ షిప్) అమలయ్యే విధానం. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మన జాతి లేదా మతం చాలా గొప్పదని చెప్తారు. పరాయి జాతి లేదా మతం వల్లనే మనం మన గొప్పతనం కోల్పోయామంటారు. ఇప్పటికీ మన మతం చాలా ప్రమాదంలో ఉందంటారు. మన మత ధర్మాన్ని రక్షించుకోవడానికై మనమంతా ఐక్యంగా ఉండి శత్రువుల అంతం చూడాలంటారు. ఇతర మతాల వారే కాదు, కమ్యూనిస్టులూ, హేతువాదులూ, లౌకికవాదులూ అంతా మన శత్రువులే అంటారు. నియంతృత్వ పాలనపైన పెరగ గల ప్రజల ఆగ్రహాన్ని ఒక సంకుచిత జాతీయవాద భావన ద్వారా,లేని అంతర్గత శత్రువును సృష్టించి, ప్రజల దృష్టినంతా అటువైపు మళ్లిస్తుంటారు. 'అంతర్గత శత్రువు పనిపట్టిన తర్వాత రాబోయే మంచి రోజుల' గురించి ప్రజలు ఎదురుచూసే పనిలో ఉంటారు. ఈ లోపు ఫాసిస్ట్‌శక్తులు, ఆర్థిక దోపిడీ శక్తులు తమ పనిని నిరాటంకంగా పూర్తిచేస్తుంటారు. అన్ని ఫాసిస్టు దేశాల్లోనూ ఫాసిస్ట్ శక్తులకు అనుకూలమైన ప్రాపగాండ ఒక పథకం ప్రకారం జరుగుతుంది. ఈ ప్రచారంలో నూటికి తొంభైతొమ్మిది శాతం అబద్ధాలే ఉంటాయి. గోరంతలు కొం డంతలు చేయబడతాయి. వాస్తవాలు పూర్తిగా వక్రీకరించబడతాయి. ఈఫాసిస్టు శక్తుల ప్రచారం వినివిని ఇదే సత్యం అని ప్రజలంతా నమ్ముతుంటారు. వెనకటికి ఒకతను అంగడిలో మేకను కొనుక్కొని ఇంటికి వెళుతుంటే, దారిలో కొంత మంది దొంగలు కలిసి, అది మేక కాదు కుక్క అని పదేపదే చెప్పగా, అతడు అది నిజంగానే కుక్క కావచ్చని వదిలివేసి నట్టుగా సాధారణ ప్రజల పరిస్థితి ఉంటుంది. ఇందుకోసం చాలా పెద్ద కిరాయి యంత్రాంగం పనిచేస్తుంటుంది. ఎందు కంటే ఫాసిస్టుల ప్రాణం ఆ ప్రాపగాండాలోనే ఉంది. బహి రంగ తీవ్రవాదం నడుస్తుంటుంది. ప్రైవేటు సైన్యాలు, సాయుధ లేదా నిరాయిధ మూకలు యధేచ్ఛగా పౌర సమా జంలో హింసకు పాల్పడతారు. జాతి లేదా మత సెంటి మెంట్లు గాయపడ్డాయనే పేరు మీద ఇవన్నీ జరుగుతాయి. ఫాసిస్టులకు ఒక ప్రత్యేకమైన ఆర్థిక విధానం అంటూ లేదు. దోపిడీదారుల ఆర్థిక విధానాన్ని సులభతరం చేస్తూ, వారితో ఐక్య సంఘటనలోనే ఉంటారు. అన్నిఫాసిస్టు దేశాల్లోనూ అదే జరిగింది. ఈ ఆర్థిక విధానాలేవీ వాళ్ల నిత్యం వల్లించే జాతికి లేదా మతానికి నష్టంతప్ప లాభం చేయవు. అయినా ఫాసిస్టుల విధానంఅలాగే కొనసాగుతుంది. కమ్యూనిస్టు పోరాటాలు, శ్రామికవర్గ పోరాటాలు ఉన్నచోట వాటిని రాజ్యం, ప్రైవేట్ సైన్యంకలిసి క్రూరంగా, హింసాత్మకంగా భయపెడు తాయి లేదా జైల్లో వేస్తాయి. భీమాకోరేగాం పేరుతో ఒక మాయా కేసును సృష్టించి దేశంలో రాజ్యాన్ని ప్రశ్నించగల మేధావులందర్నీ జైల్లో వేయటం, ఢిల్లీ షాహీన్ భాగ్‌లో వేలాది ముస్లిం మహిళలు చేసిన శాంతియుత నిరసనపై, ఢిల్లీ పరిసరాల్లో రైతులు చేసిన ఆందోళనలపై రాజ్యం విరుచుకుపడ్డ తీరు, బస్తర్‌లో కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసులు చేస్తున్న శాంతియుత నిరసనలపై అమలౌతున్న క్రూరఅణచివేత ఇందుకు సజీవ ఉదాహరణ లు. పై లక్షణాలున్న ఏ దేశాన్నయినా ఫాసిస్టు దేశం అన వచ్చు. భారతదేశ ఫాసిజంలో వీటికి అదనంగా ఒక ప్రత్యేక లక్షణం ఉంది. అది 'హిందూజాతి' అనే భావనలోనే కొనసాగే దారుణ సామాజిక అసమానత్వం. నిజానికి, ఈ దేశంలోని ఫాసిస్టుల లక్ష్యం 'మత శత్రువుల' బెడదను నిర్మూలించటం కాదు, నిచ్చెన మెట్ల సామాజిక స్థానాలతో కూడిన హిందూ రాజ్యాన్ని పునః స్థాపించటం. ఈ ఒక్క అంశం మన దేశ ఫాసిజానికి సంబంధించి ప్రత్యేకం, చాలా కీలకం. ●

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# భాషలు, ఆచారాలు వేరైనా జాతీయ భావం ఒక్కటే

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 17, ప్రభాతవార్త:** భాషలు, ఆచారాలు వేరైనా అందరిలో జాతీయ భావం ఒక్కటేనని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. భారత్ భారతీ సంస్థ, నిపిడ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం న్యూ బోయిన్‌పల్లిలోని నిపిడ్ ఆడిటోరియంలో భారత్ కళాసంగమం-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ ప్రసంగిస్తూ సనాతన ధర్మానికి ఆది, అంతం లేదని ఆయన పేర్కొన్నారు. దేశప్రజల్లో భారతీయతను చాటిచెప్పేందుకు భారత్ భారతీ సంస్థ వారు వివిధ రాష్ట్రాలకు చెందిన కళా బృందాలతో దేశ నలుమూలల్లోని 150 ప్రధాననగరాల్లో ఇలాంటి సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తుండడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో భారత్ భారతీ సంస్థ దివ్యాంగులను సైతం భాగస్వామ్యం చేయడం అభినందనీయమని అన్నారు. భారత్ భారతీ సంస్థ జాతీయ అధ్యక్షుడు వినయ్ పత్రాలే మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికన్నా ముందు ఇటు భారత్, అటు పాకిస్థాన్‌ల్లోని ఏ దేశంలో నైనా తమ రాజ్యాలను విలీనం చేసుకోవచ్చునని, లేకపోతే స్వతహాగా తమ రాజ్యాన్ని తామే పరిపాలించుకునే అప్పటి రాజులకు వీలును కల్పించి బ్రిటిషర్లు తమ కుటిలనీతిని చాటుకున్నారని అన్నారు. కానీ, తొలిసారిగా కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన సర్దార్‌వల్లభ్‌భాయ్‌పటేల్ అన్ని రాజ్యాలను భారతదేశంలో ఐక్యం చేయాలన్న కృతనిశ్చయంతో ముందు కెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కళాసుధ తెలుగు సంఘం చెన్నయ్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్, అమితారాణి, కనకకుమార్, మీనాక్షి పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి

## అసెంబ్లీలో సిపిఐ పక్ష నేత కూనంనేని

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త :** వెనుబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకురావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ చరిత్రలో నిలిచిపోతారని సిపిఐ పక్ష నేత కె సాంబశివరావు ప్రశంసించారు. బిసి రిజర్వేషన్లపై కేంద్రం నుండి అనుమతి వచ్చేంత వరకూ ఈ లోపు అవకాశం ఉన్న రంగాల్లో 42 శాతం అమలు చేయాలని కోరారు. బిసి రిజర్వేషన్ల విషయంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా అమలు చేయడం ద్వారా తెలంగాణ చరిత్రలో సరికొత్త అధ్యయనమవుతుందని చెప్పారు. బిసి రిజర్వేషన్ల బిల్లులపై శాసనసభలో సోమవారం చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లులను ఏకగ్రీంగా అసెంబీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయడం అభినందనీయమని చెప్పారు. అంతేకాకుండా రెండు సార్లు పక్కాగా కులగణన సర్వే చేసి బిసిల జనాభాను తేల్చడంతో ఎటువంటి సమస్యలూ లేవన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రం హయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆనాడు మహిళలకు రిజర్వేన్లు తీసుకొచ్చి ఆదర్శవంత మయ్యారన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 శాతం మేర బిసి వర్గాలకు రిజర్వేషన్లు తీసుకురావడంతో చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని వ్యాఖ్యానించారు.



# ఇంటికే భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు

## తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్‌టిసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను కోరుకున్న భక్తుల ఇళ్లకు చేర్చాలని టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించింది. ఎప్పటిలాగానే ఈసారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో .. రాములోరి కల్యాణ తలంబ్రాలను హోం డెలివరీ చేసే పవిత్ర కార్యానికి సంస్థ శ్రీకారం చుట్టింది. తలంబ్రాలు కావాల్సిన భక్తులు టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సంస్థ ఎండీ విసి సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను సంస్థ ఎండీ విసి సజ్జనర్ ఆవిష్కరించి.. తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని లాజిస్టిక్స్ కౌంటర్లతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టిజిఎస్ఆర్‌టిసి కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-69440069, 040 -69440000లలో సంప్రదించాలని సజ్జనార్ తెలిపారు.

# గోదావరి కన్నీటి గోస మహాపాదయాత్ర ఆరంభం

**గోదావరిఖని, ప్రభాతవార్త:** అపర భగీరథుడు కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కడితే కడుపు మంటతో మేడిగడ్డ పేరు చెబుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఎండబెట్టి గోదావరి కన్నీటి గోసకు కాంగ్రెస్ రేవంత్ సర్కారణ కారణమవుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి ఎంతో గొప్పగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ గోదావరి నదికి జీవం పోస్తే... అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ గోదావరి నదిని ఎండబెట్టి రైతులను, ప్రజలను అరిగోస పెడుతున్నారని, గోదావరి నదిని ఎడారిగా మార్చిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. గోదావరి గోసను, ప్రజల, రైతుల బాధలను మాజీ సిఎం కెసిఆర్‌కు విన్నవించేందుకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కో ఆర్డినేటర్ బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో గోదావరి గోస మహా పాదయాత్రను సోమవారం చేపట్టారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జడ్పీ చెర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, రఘువీర్‌సింగ్ హాజరై ఈ పాదయాత్రను ప్రారంభించారు.

# కేంద్ర నిధులు రాకున్నా విద్యారంగం బలోపేతం చేస్తున్నాం



### విదేశీవిద్య పథకాన్ని రాజకీయం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరాటం

### ఆశ్రమ పాఠశాల డైట్ చార్జీలు 40శాతం పెంచాం: అసెంబ్లీలో మంత్రి సీతక్క

### విదేశీవిద్యకు, పరాయి రాష్ట్రంలో చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం అందడంలేదు : గంగుల

### విద్యార్థి ఆత్మహత్యను దాచిన ప్రభుత్వం: కొత్త ప్రభాకర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త** 'బొట్టు పసే కానీ బోనం పసలేదు' అన్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తూ నిధులు విడుదల చేయకున్నా సెంట్రల్ స్కాలర్‌షిప్ పథకాలను రద్దుచేసుకున్నారని, విదేశీ విద్య పథకాన్ని రాజకీయం చేయాలని గంగుల కమలాకర్ ఆరాటపడుతున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విదేశీ ఉపకార వేతనాల చెల్లింపు జాప్యం, జటోత్ రాం చందర్ నాయక్‌లు మెస్‌డైట్ చార్జీల పెంపుపై అడిగిన ప్రశ్నలకు సీతక్క సమాధానం ఇస్తూ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చేనాటికి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు రూ. 4,332కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. విదేశీ విద్యా పథకం కింద 1913 మంది చదువుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 210 మంది ఎస్సీలను 300 మంది బిసిలకు 100 మందిఎస్టీలను 500 మంది మైనార్టీలను ఈ పథకం కింద ఎంపిక చేశామని తెలిపారు. మొత్తంగా 1110 మంది ఎంపికైనారు. విదేశీ విద్యాపథకం కింద 1913 మంది చదువుతున్నారని ఆమె తెలిపారు.

హాస్టళ్ళలలో పిల్లలకు హాని చేస్తే కఠినం చర్యలు తీసుకొంటామని ఆమె హెచ్చరించారు. విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలు పెంచామని గత ప్రభుత్వం ఏడేళ్ళుగా పెంచలేదని ఆమె తెలిపారు. డైట్‌పై 499కోట్ల 51లక్షల 66వేలు ఖర్చుచేశామని తెలిపారు. ఏడులక్షల 66వేల మంది విద్యార్థులు లబ్దిపొందారని ఎమ్మెల్యే రాంచరద్‌నాయక్‌కు సమాధానం ఇచ్చారు. కాస్మొటిక్ చార్జీలు 212శాతం పెంచామని తెలిపారు. హాస్టల్‌లో కల్తీ ఆహారం నిరదోధించేందుకు పకడ్బంది చర్యలు తీసుకొంటున్నామని మహిళా ఐఎఎస్ అధికారులను హాస్టళ్ళలలో నైట్‌హాల్ట్‌చేయిస్తున్నామని ఆమె తెలిపారు. వివిధ రాజకీయ నాయకులు కూడా రాత్రి బస చేస్తున్నారని ఆమె తెలిపారు.

**జిఒ10 అమలు చేయండి : గంగుల కమలాకర్**



పొరుగురాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటలలో చదువుకొనే విద్యార్థులకు సంవత్సరానికి రెండులక్షల రూపాయల స్కాలర్‌షిప్ ఇచ్చే పథకాన్ని అమలు చేయాలని, గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈ ప్రభుత్వంకు విదేశి విద్య పథకంపై చిత్తశుద్దిలేదని విమర్శించారు.

సీతక్క సమాధానం ఎంపికైన విద్యార్థుల సంఖ్యను1913 అంటు తప్పుగా చెప్పడమే నిదర్శనం అని ఆయన ఆరోపించారు. గతంలో బిసిలు 2230మంది విద్యార్థులను ఎంపికచేశామని ఆయన చెప్పారు 2016 నుంచి 6700 మందికి ఈ పథకం ద్వారా కెసిఆర్ విదేశీయానం కలిగించారని అన్నారు. ఇందులో 780మంది బ్రాహ్మణులు 2130 మంది బిసిలు, 2,751 మంది మైనార్టీఉల లబ్దిపొందారని తెలిపారు. విదేశి విద్యా పథకం బకాయిలు వెంటనే చెల్లించాలని గంగుల కమలాకర్‌తోపాటు అనీల్‌జాదవ్ కోరారు. విదేశి విద్యను మధ్యలో మానుకొని రావాల్సిన దుస్థితి నెలకొందని వారు విమర్శిం చారు.

హాస్టల్లలో విద్యార్థుల అసహజ మరణాలు పెరిగిపోవడంపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, అనీల్‌జాదవ్, గంగుల కమలాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాకలో హాస్టల్‌లో ఆరవతరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దానిని ఎందుకు దాచారని ఆయన నిలదీశారు. ఈ ప్రభుత్వం వచ్చాక 83 మంది విద్యార్థులు అసహజ మరణం పొందారని, అనగా పదేళ్లలో 113 మంది గత ప్రభుత్వ హయాంలో చని పోయారని సీతక్క కూడా గుర్తుచేశారు.

# గత ప్రభుత్వం అప్పులచిప్ప చేతికిచ్చింది

## ఎకో టూరిజం అభివృద్ధికి కృషి: మంత్రి జూపల్లి



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం అప్పుల చిప్పను చేతికి ఇచ్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. తెలంగాణలో ఎకో టూ రిజం అభివృద్ధికి కృషి చేస్తామని పర్యాటశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జీరో అవర్ సందర్భంగా ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, పైడి రాకేష్‌రెడ్డి, అడ్లూరి లక్షణ్‌లకు సమాధానం ఇచ్చారు.

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయని అందులో భాగంగా గోదావరిలోకి మురికినీరు వెళ్ల కుండా అడ్డుకోవాలని సూచించారు. ధర్మపురిలో మురికినీరు నేరుగా గోదావరిలో కలుస్తోందని మురికినీటిని శుద్ది చేయాల్సిన ఆవశ్యకత వివరించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ తన వద్ద ఉన్న ప్రాచీన దేవాలయాలు త్రిలింగేశ్వర ఆలయం గొప్పతనం వివరించారు. టూరిజనం అభివృద్దికి ఎల్లారెడ్డిలో అనేక ఆధ్యాత్మిక, పకృతి రమణీయ ప్రదేశాలు పోచారం ప్రాజెక్టు ఉందని తెలిపారు. క్రీడాటూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన సూచిం చారు. పాల్వాయి హరీష్‌రావు ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని కోరారు. మహబూబాబాద్ జిల్లాలో బీమునిపాదం అబివృద్దిచేయాలని సూచించారు. ఇనుగుర్తిలో దాసరి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు.

**వాయిదా తీర్మానాలు తిరస్కరణ**

సోమవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ బిజెపి, సిపిఐ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. బిజెపి సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అభయ హస్తం మీద, సిపిఐ సభ్యుడు సింగరేణి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వాయిదా తీర్మానం ఇచ్చారు. వాటిని స్పీకర్ తిరస్కరిస్తూ ప్రకటనచేశారు.

# అసెంబ్లీ గాంధీభవన్ కాదు..

### శాసనసభలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మండిపాటు

### సభ నుంచి ఎంఐఎం వాకౌట్



**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** 'శాసనసభను నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సభ్యులు అడిగిన సమాధానం ఇవ్వడం లేదు. ప్రశ్నలు కూడా మార్చుతున్నారు. సభ్యులు అడిగుతున్న ప్రశ్నలను చాలా వరకు తొక్కి పెడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది గాంధీ భవన్ కాదు. అసెంబ్లీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీభవన్‌లా కాదు. మీ ఇష్టం వచ్చినట్లు నడుపుతాం అంటే చెల్లదు' అని ఎంఐఎం ఎమ్మెల్యే ఓవైసీ అక్బరుద్దిన్ మండిపడ్డారు. సోమవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం ముగించి స్పీకర్ గడ్డం ప్రసాద్ జీరో అవర్ తీసుకొని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంతర్‌రెడ్డికి అనుమతి ఇవ్వడంతో అక్బరుద్దిన్ తన ప్రశ్నకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరగా, జిరో అవర్ తీసుకొన్నామని ప్రశ్నోత్తరాలకు గడువు విధించిన గంటకు మించి ఒకటిన్నర గంటలు నిర్వహించామని స్పీకర్ అక్బరుద్దీన్‌కు అవకాశం ఇవ్వలేదు. మరోవైపు పసుపు మద్దతు ధరపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అనర్గళంగా ప్రసంగిస్తున్నారు. ఈ క్రమంలో అక్బరుద్దీన్ ఆయన పార్టీ ఎమ్మెల్యేలు నిలబడి నిరసన వ్యక్తంచేశారు. శాసన సభలో కొత్త సాంప్రదాయం ఏంటి మంత్రి ఎందుకు ప్రశ్న చదవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిన్న రాత్రి 10గంటలకు ఎజెండా మాకు అందింది మేము ఎలా ప్రిపేర్ అవ్వాలి అని నిలదీశారు. ఎంఐఎం ఆరుగురు సభ్యులతో సభలో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సభనడిపించడం చేతనవడం లేదని అక్బరొద్దిన్ విరుచుకుపడ్డారు. ప్రశ్నోత్తరాలు ముగిసిందని స్పీకర్ చెప్పారే కానీ మిగిలిన ప్రశ్నలకు ఏంటి అనేది మాటమాత్రం చెప్పకుండా ఎలా ముగిస్తారని నిలదీశారు. అసెంబ్లీ నడిపే పద్దతి ఇదేనా, రంజాన్ ఉపవాసం ఉంటూ కూడా నేను ప్రజల సమస్యలు చట్టసభల్లో ప్రస్తావించడానికి వచ్చానని ప్రశ్నలడిగితే ఆన్సర్ ఇవ్వరు, ప్రశ్నలను మార్పు చేసి ఇష్టం వచ్చినట్లు రూపొం దిస్తారు. వెరీ సాడ్ ఇదేంటి అని గట్టిగా అక్బరొద్దిన్ పెద్దగొంతుతో నిరసన తెలిపారు. అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సభ నిర్వహణపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా.. అధికార పక్షానికే ఎక్కువ సమయం కేటాయించడాన్ని ఓవైసీ తప్పుబట్టారు. రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామిక విలువలతో నిబంధనల ప్రకారంశాసనసభ నడవడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం అంటూ బయకు వచ్చి నిరసన తెలిపారు.

# ఉస్మానియా పేరు మార్పు ప్రతిపాదనతో బిజెపి, ఎంఐఎం మధ్య రగడ

### ఒయుకు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టండి

### బిజెపి ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ పేరు మార్పు ప్రతిపాదన బిజెపి చేయడంతో అసెంబీల్లో బిజెపి ఎంఐఎం మధ్య రగడ నెలకొంది. ఎమ్మెల్యే అహ్మద్ బలాల బిన్ అబ్దుల్లా బలాలా ఈ ప్రతిపాదనపై తన ఆగ్రహం వ్యక్తంచేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును ప్రముఖ కవి, ఉద్యమకారుడు సురవరం ప్రతాప్ రెడ్డిగా మారుస్తూ అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహా బిల్లు ప్రవేశపెట్టారు. దీనిని బిజెపి వ్యతి రేకించింది. రాష్ట్రంలోని వైశ్యుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా వారు అభి వర్ణించారు. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరు ఉస్మానియా యూనివర్సిటికి పెట్టాలని ఆయన ఆశయాలకు అనుగుణంగా అది ఉంటుందని బిజెపి ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధన్ పాల్ సూర్యానారాయణ అన్నారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పొట్టిశ్రీరాములు పేరు మార్పు తగదని ఆయన గాంధీతో సహచరుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం మద్రాస్ నుంచి తెలుగు రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాడిన వ్యక్తి అని చరిత్రను గుర్తుచేశారు. బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూపొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు అవివేకమైన చర్య. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికి పరిమితమైన నేత కాదు. దళితుల కోసం పోరాటం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలి. సీఎం చెప్పినట్లు ఏపీలో పొట్టి శ్రీరాములు వర్సిటీ లేదు. పొట్టి శ్రీరాములు పేరుతో దేశంలో ఎక్కడా వర్సిటీ లేదు అని ఎమ్మెల్యే సూర్యనారాయణ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్పును బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. కావాలంటే ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టుకోవాలి అని అధికార కాంగ్రెస్ పక్షానికి సూచించారు.

# పసుపు మద్దతు ధర రూ.12వేలు చెల్లించండి

### సిండికేట్‌తో పసుపు రైతును దగా చేస్తున్న దళారులు

### మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** పసుపు బోర్డు ఏర్పాటు చేశారు కానీ పసుపుకు మద్దతు ధర 15వేలు ఇస్తామన్న హామి కేంద్రప్రభుత్వం నిలుపుకోలేదని కనీసం రాష్ట్రపాలకులైన పూనుకొని కాంగ్రెస్ మేనిఫెస్టోలో క్వింటాల్‌కు 12వేల మద్దతు ధర ఇప్పిస్తామనే హామిని అమలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. జిరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర సాంగ్లీలో పసుపు క్వింటాల్‌కు 15వేల నుంచి 14వేల వరకు పలుకుతోందని తెలిపారు. నిజామాబాద్ ఎఎంసిలో పసుపుకు మార్కెట్‌లో క్వింటాల్‌కు ఏడు నుంచి 8వేల వరకు మాత్రమే పలుకుతోందని అన్నారు. రాష్ట్రప్రభుత్వం పసుపురైతుకు మిగితా భారం బోనస్‌రూపంలో ఇవ్వాలని ఆయన కోరారు. సిండికేట్ పసుపు రైతును దగాచేస్తున్నదని ఆయన తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం

## మాల సంఘాల జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తమ డిమాండ్లను పరిష్కరించకుండా అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును పెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల సంఘాల జేఏసి చైర్మన్ జి. చెన్నయ్య హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 యేళ్లుగా ఎస్సీలల్లో మాదిగలే అన్ని రంగాల్లో లబ్దిపొందుతూ వస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాలలు తీవ్ర వెనుక బాటుకు గురయ్యారన్నారు. ఇటీవల మాలల జెఎసి బృందం తరపున సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి షమీమ్ ఆర్డర్ కమిషన్ రిపోర్టు తప్పుల తడకగా ఉందని వివరించామన్నారు. అలాగే తమకు జరిగిన అన్యాయంపై సిఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని కాని మాలల సమస్యలు పరిష్కరించకుండానే వర్గీకరణ బిల్లులు పెట్టడం సమంజసం కాదన్నారు. అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన మాలలను గ్రూప్-1లో చేర్చాలన్నారు. సమావేశంలో మాల ప్రజాసంఘాల జెఎసి వర్కింగ్ చైర్మన్ చెరుకు రాంచందర్, కిషన్, మన్నె శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అసెంబ్లీ మీడియా పాయింట్

## ఢిల్లీకి వెళ్లి 42శాతం రిజర్వేషన్లు సాధిస్తాం

### బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వడం శుభపరిణామం : మంత్రి పొన్నం

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త :** బిసిలకు స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విప్లవాత్మక నిర్ణయం మని ఇదే స్ఫూర్తితో ఢీల్లీకి వెళ్ళి కేంద్రప్రభుత్వ పెద్దలను కలిసి రిజర్వేషన్లను సాధిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు సోమవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద బిసి ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యేలు ఒకరికొరకు స్వీట్లు పంచుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'శాసన సభలో అన్ని రాజకీయ పార్టీలు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి. కుల సర్వే ఆధారంగా తెలంగాణ జనాభా పై ప్రామాణిక సర్వే చేయడం ద్వారా 42 రాజకీయ విద్యా ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో బిల్లు అమోదించుకోవడం జరిగింది. షెడ్యూల్ 9లో పెట్టడానికి కేంద్రానికి పంపే బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించబడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి తెలంగాణ కు ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రుల సహకారం తీసుకొని 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తాం' అని పొన్నం పేర్కొన్నారు.

**రేవంత్‌రెడ్డి స్థాయికి నేను చాలు: బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి**



సిఎం రేవంత్‌రెడ్డి స్థాయికి కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు అవసరం లేదని ఆయన స్థాయికి తాను చాలని బిఆర్‌ఎస్ హుజూరారబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. "స్టేషన్ ఘన్‌పూర్‌లో నోటికి వచ్చినట్లు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కేసీఆర్ ఇచ్చి నన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. మీ జాబ్ క్యాలెండర్ ప్రకారం వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలి. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన కరెంటు, నీళ్ళు, రైతు బంధు ఇప్పుడు ఎందుకు రావు. వరంగల్ కి టెక్స్ టైల్ పార్కు, కోచ్ ఫ్యాక్టరీ తెచ్చిన ఘనత కేటీఆర్‌ది. రేవంత్ రెడ్డి నీ స్థాయి కేసీఆర్, హరీష్ రావు స్థాయి కాదు. కేవలం నీ స్థాయి కౌశిక్ రెడ్డి స్థాయి మాత్రమే. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు నిలదీస్తూనే ఉంటాం. కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారితే, తన బిడ్డ కూడా అభివృద్ధి కోసం బీజేపీ పార్టీకి మారాలి కదా..వీరి నాటకాలన్నీ ప్రజలు గమనిస్తు న్నారు. తప్పక రాబోయే రోజుల్లో బుద్ధిచెపుతారు"అని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఏకపక్షంగా పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు**

**బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

పొట్టి శ్రీరాములువర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టే బిల్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. 'తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతీసే నిర్ణయం ఇది. పొట్టి శ్రీరాములు జాతీయ నాయకుడు. తెలుగు రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి. పొట్టి శ్రీరాములు పేరు తొలగించి మీరు తీసుకుంటున్న చర్య ఆర్య వైశ్యుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయి. మీ కులం వారిమీద ఉన్న ప్రేమ అభిమానంతో యూనివర్శిటీ పేరు మార్చే నిర్ణయం ఇది. ఆర్య వైశ్యులు ఏకమై ప్రభుత్వం మీద తిరుగుబాటు చేస్తారురాబోయే రోజుల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెపుతారు "అని పేర్కొన్నారు.

# ఆర్‌టిఐ కింద ప్రశ్నలు వేస్తే సమాధానాలు ఇవ్వడం లేదు

### ప్రతిపక్ష ఎమ్మెల్యేలను నియంత్రించడం కోసం ఇన్‌చార్జి మంత్రులు

### కొడంగల్ మాదిరిగా ప్రతి నియోజకవర్గానికి వెయ్యికోట్లు ఇవ్వండి

### ప్రశ్నలకు సమాధానం చెప్పని పాలకులు సిగ్గుపడాలి

### బిజెపి ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, కాటేపల్లి వెంకటరమణారెడ్డి



పైడి రాకేష్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ప్రతిపక్ష ఎమ్మెల్యేలను నియంత్రించడం కోసం ఇన్‌చార్జి మంత్రులను నియమించారని ఇన్‌చార్జి మంత్రులు శాసనం ప్రకారం నిర్మితులా ఏదైనా జిఒ ఉందా అని బిజెపి ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, కాటేపల్లి వెంకట రమణారెడ్డిలు నిలదీశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు బిజెపి కేంద్ర మంత్రులను ఏం తెచ్చారు ఏం ఇచ్చారని నన్ను ప్రశ్నిస్తుందని కానీ నాకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిచ్చిందని అని ఆయన నిలదీశారు. శాసనసభలో బిజెపి బిఆర్ఎస్, కాంగ్రెస్ మూడు పార్టీల నుంచి ఎన్నికైన సభ్యులకు సమాన హక్కులు ఉంటాయని అన్నారు. గత ఏడాది నా నియోజకవర్గంకు 90 లక్షలు మాత్రమే ఇచ్చారని మిగితావి ఇంచార్జీ మంత్రుల చేతిపెట్టారని ఆయన ఆరోపించారు. కొండగల్‌కు వెయ్యికోట్లు ఇచ్చినట్లు అన్ని నియోజవకవర్గఆలకు ఇవ్వాలని పైడి రాకేష్‌రెడ్డి డిమాండ్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి కూడా వినిపించారు. ఓటమిపాలైవారు, పారిపోయినవాళ్లు కామారెడ్డికి వచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటు స్థానిక ప్రజాప్రతినిధికి గౌరవంలేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. మేం ప్రతిపాదించిన పనులు చేయడంలేదని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వంకు శాసనసభలో 84 ప్రశ్నలు వేస్తే 8 ప్రశ్నలకు మాత్రమే సమాధానం వచ్చిందని, ఇంకా 76 ప్రశ్నలకు సమాధానం రాలేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆదే విధంగా ఆర్‌టిఐ కింద 86 ప్రశ్నలు వస్తే 9శాతం ప్రశ్నలకు సమాధానం వచ్చిందని, మిగతా వాటికి సమాధానం రాలేదని దుయ్యబట్టారు. ప్రశ్నలకు సమాధానం చెప్పని పాలకులు సిగ్గుపడాలని ఆయన దుయ్యబట్టారు. పోటీ నుంచి పారిపోయిన నేతలకు ప్రొసిడింగ్‌లు ఇచ్చే సాంప్రదాయం వారిచేత కొబ్బరి కాయలు కొట్టించే సాంప్రదాయం ప్రజాస్వా మికమా అని విమర్శించారు. ప్రజలచేత ఎన్నుకోబడిన వారిని పక్కన పెడుతన్న ప్రభుత్వానికి ప్రజలచేత రానున్న రోజుల్లో పక్కన బెట్టిస్తామని ఆయన హెచ్చరికలు చేశారు.



వెంకట రమణారెడ్డి

# భారత్‌లో వాంటెడ్ ఉగ్రవాదులకు పాక్‌లో భారీ భద్రత

## వరుసగా ప్రత్యర్థుల కాల్పుల్లో హాతమవుతున్న లష్కర్ కమాండర్లు

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** భారత్‌లో అనేక నేరాలు, ఘోరాలకు పాల్పడి పాక్‌లో తల దాచుకున్న పాకిస్తాన్ ఐఎస్ఐ ఉగ్రవాదులకు ఇప్పుడు ప్రాణ భయం పట్టుకుంది. వంద గొడ్లను తిన్న రాబందువు ఒక్క గాలి వాటానికి కొట్టుకుపోయినట్లు పాక్‌లో ఇంతకాలం ఆడింది ఆట పాడింది పాటగా సాగిన ఐఎస్ఐ ఉగ్రవాదులు ఇప్పుడు వారి ప్రత్యర్థుల చేతిలో వరుసగా హాతమవుతున్నారు. ఈ అంశం ఇప్పుడు పాకిస్తాన్ అంతటా హాట్ టాఫిక్‌గా మారింది. నిన్నమొన్నటి వరకు భారత్‌లో ఘోరాలు చేసిన ఉగ్రవాదులకు పాక్‌లో నీరజనాలు లభించేవి. రాజకీయ నాయకులతో పాటు మిలటరీ అధికారులు కూడా వీరికి వివిఐపి మర్యాదలు చేసేవారు. ఒక రకం గా చెప్పాలంటే వీరికి పాక్‌లో రాచమర్యాదలకు కొదవ వుండేది కాదు. కానీ కాలం ఎల్లప్పుడు ఒకేరీతిన వుండదనేది తెలిసిందే. ఇంతకాలం పాక్ గడ్డమీద రారాజులా వెలుగుతూ భోగాలు అనుభవిస్తూ భారత్‌లో అమాయకులను చంపిన ఐఎస్ఐ ఉగ్రవాదులు, వీరికి సహకరించే లష్కర్ ఏ తోయిబా సహా ఇతర ఉగ్ర సంస్థల కిరాయి మూకలు ప్రస్తుతం పాక్‌లో ప్రత్యర్థులు జరుపుతున్న దాడుల్లో హాతమవుతున్నారు. పాక్‌లో అనేక ఉగ్రవాదుల గ్రూపులు వున్నాయి. ఇవన్నీ పాక్ సర్కారు కనుసన్నన లోనే పనిచేస్తుంటాయి. ఈ గ్రూపులకు పాక్ సర్కారు నిధులు అందిస్తుండగా మిలటరీ అధికారులు బాస్‌లుగా వుంటారు. ఈ గ్రూపులన్నీ భారత్‌లో దాడులు చేయడం, అమాయకులను చంపడం, భద్రతా బలగాలపై దాడి చేయడంలో ఆరితేరాయి. అయితే కొంతకాలంగా పాక్ ఉగ్రవాదుల ఆటలను భారత్ సాగనివ్వక పోవడంతో ఇక్కడ వారి ఆగడాలు చాలా వరకు తగ్గాయి. దీంతో పాక్‌లోని ఉగ్రవాద గ్రూపుల్లో కొన్నింటిని బలోచిస్తాన్‌లో అక్కడ తిరుగుబాటుదారులపై దాడులకు, ఆఫ్ఘనిస్తాన్‌లో అక్కడి సర్కారును అస్థిరపరిచేందుకు పాక్ మిలటరీ వాడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే బలోచిస్తాన్‌లో తిరుగుబాటుదారులు తమపై దాడికి పాక్ మిలటరీ అ ధికారులు పంపిన ఉగ్రవాద గ్రూపులను వరుసగా టార్గెట్ చేస్తున్నారని అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గడచిన ఆరు నెలల వ్యవధిలో పాక్‌లో ప్రముఖ ఉగ్రవాద గ్రూపుల్లో 50 మంది వరకు టాప్ కమాండర్లు ప్రత్యర్థులు, గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో చనిపోయారు. ఇందులో భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, ల ష్కర్ ఏ తోయినా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు ముఖ్య అనచరులు పలువురు వున్నారు. హాఫీజ్ సయీద్‌కు పాక్ పాలకులు వివిఐపి భద్రత ఇస్తుంటారు. అతని అనుచరు లు, సహచరులకు కూడా భద్రత వుంటుంది. వీరి భద్రతను పాక్ గూఢాచార సంస్థ ఐఎస్ఐ చూస్తుంటుంది. ప్రస్తుతం సయీద్ లాహోర్‌ట ఒక కేసులో జైలు శిక్ష అను భవిస్తున్నా ఇదంతా డ్రామాగా అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇక సయీద్‌కు జైల్లో కూడా భారీగానే భద్రతను పొందుతున్నాడు. సయీద్ అనుచరు లు లష్కర్ ఏ తోయిబా టాప్ కమాండర్లు హంజ్లా అదన్నాన్, రియాజ్ అహ్మద్‌లు గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించారు. గత ఏడాది సయీద్‌కు అత్యంత నమ్మకమైన అనుచరుడు లష్కర్ ఏతోయిబాలో ద్వితీయ స్థానంలో వున్న లబ్దుల్ రెహమాన్ మక్కీ కూడా ఇలాగే గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో హాతమయ్యాడు. మక్కీ అంత్యక్రియలకు సయీద్ భయపడి పాల్గొనలేదు. తన కుమారుడిని మారువేషంలో పంపాడు. ఇక తాజాగా గత శనివారం సయీద్‌కు మరో ముఖ్య అనుచరుడు అబు ఖతాల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి చంపేయడం తెలిసిందే. ఈఘటనలో ఖతాల్ సెక్యూరిటీ గార్డు కూడా మరణించాడు. ఇక హాఫీజ్ స యీద్ ఇంటిపై ప్రత్యర్థులు పలుమార్లు బాంబు దాడులకు పాల్పడ్డారు. రెండుసార్లు బాంబు దాడి నుంచి సయీద్ తృటిలో తప్పించుకున్నాడు. ప్రత్యర్థుల దాడుల నుం చి తనను తాను రక్షించుకునేందుకు, కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు సయీద్ తరచూ స్థావరాలను మారుస్తున్నాడు.



సోమవారం ఉత్తమ ఫొటో జర్నలిస్ట్ పద్మకు అవార్డు ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉంది: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 17 ప్రభాతవార్త:** ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని, నాటి రోజుల్లోనే దేశంలో ప్రప్రథమంగా ఫోటో కెమెరాలు ఖరీదు చేసి ఫోటోగ్రఫీను అభివృద్ధి పరిచిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్ట్స్ అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమం సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వార్త, తెలంగాణ పండుగలు, సాంస్కృతిక విభాగాల్లో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలైన ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు ఆయన అవార్డులను అందజేశారు. వెయ్యి మాటల కన్న ఒక ఫోటో ఎంతో గొప్పదని, పత్రికల్లో ఎన్నో వార్తలు ప్రచురి తమైనప్పటికి పాఠకుల దృష్టిని అకర్షించేది ఫోటోలు మాత్రమేనని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, అఖిల భారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుడి దేవేందర్‌రెడ్డి, టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్‌అలీ, కె.రాంనారాయణ, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎస్.హరి పాల్గొన్నారు.

## లక్ష్మణ్ ఆశయాలకు అనుగుణంగా నడవాలి

### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బంగారు జయంతి

**హైదరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రి, బిజెపి మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ 86వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, శివాజీ, మొగిలయ్య, అశోక్, క్రాంతికిరణ్, తదితరులు పాల్గొని లక్ష్మణ్ సేవలను కొనియాడారు. బంగారు లక్ష్మణ్ ఆశయాలను కొనసాగించడమే బిజెపి కార్యకర్తలుగా, ఎస్సీ మోర్చా కార్యకర్తలుగా మనందరిపై ఉందన్నారు.



## హైపర్‌లూప్ టెస్టింగ్ కేంద్రాన్ని తనిఖీచేసిన కేంద్ర మంత్రి

**చెన్నై,మార్చి 17:** భారత్‌లో త్వరలో పట్టాలెక్కనున్న హైపర్‌లూప్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ చెన్నైలోని ఐఐటి మద్రాస్‌లో ఉన్న హైపర్‌లూప్ టెస్టింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద హైపర్‌లూప్ ట్యూబ్‌ను ఏర్పాటుచేస్తున్న భారత్ దీని నిడివి 410 మీటర్ల పొడవు ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం 410 మీటర్ల నిడివి ఉన్న హైపర్‌లూప్ టెస్ట్‌ట్యూబ్ ఐఐటి మద్రాస్‌లో ఉంది. దీనితో ఇపుడు ఐఐటి మద్రాస్‌కు ఆసియాలో అతిపెద్ద పొడవున్న హైపర్‌లూప్ ట్యూబ్ ఉనన కేంద్రంగా రికార్డుసాధించింది. 2013లో ఎలాన్ మస్క్ ఈ హైపర్‌లూప్ టెక్నాలజీని ప్రవేశపెట్టారు. రవాణా వ్యవస్థలో అత్యంతవ వేగంగా వెళ్లేందుకు వీలుగా వాక్యూమ్ సీల్డ్ ట్యూబ్‌లనుంచి ప్రొపెల్‌పాడ్స్ వరకూ సుమారు గంటకు వెయ్యికిలోమీటర్ల వేగంతో వెళ్లేవిధంగా ఈ వ్యవస్థకు రూపకల్పనచేసారు. చెన్నైలోని ఇంటిగ్రల్‌కోచ్‌ఫ్యాక్టరీలోనే ఈ హైపర్‌లూప్ వ్యవస్థకు ఎలక్ట్రానిక్‌పరికరాలను కూడా అభివృద్ధిచేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి వివరించారు. కేంద్ర రైల్వేశాఖ ఇందుకోసం 2022 మేనెలలోనే 8.34 కోట్ల నిధులు కేటాయించింది. హైపర్‌లూప్ టెక్నాలజీపై అధ్యయనం, అభివృద్ధిచేసేందుకు ఈనిధులు వెచ్చించారు. భారత్ అత్యంత సత్వరమే ఈ హైపర్‌లూప్‌రవాణా వ్యవస్థను అమలు చేస్తుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తంచేసారు. స్వదేశీ సాంకేతికపరిజ్ఞానం తోనే ఈ హైపర్‌లూప్ వ్యవస్థను అమలుకు తెస్తున్నట్లు మంత్రి చెప్పారు. అలాగే చెన్నై కేంద్రంలో శాస్త్రవేత్తలు,అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

## కేంద్రాన్ని ఒప్పించి చట్టం చేయండి

### బిసి బిల్లును స్వాగతిస్తున్నాం

### మాజీ మంత్రి గంగుల కమలాకర్

**హైదరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం శాసనసభలో 42శాతం బిసి బిల్లుపై గంగుల కమలాకర్ మాట్లాడుతూ బిల్లును ఆహ్వానిస్తూ సంపూర్ణమద్దతు తెలుపుతున్నామన్నారు. పార్లమెంటులో ఆమోదం పొందితేనే సంపూర్ణ సంతోషంగా ఉంటుందన్నారు. విద్యా, ఉదోయగ, రాజకీయాల్లో బిసిల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. రాజకీయ కోణంతో చూడకుండా బిసిలకు న్యాయం జరగాలన్నారు. జనభా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. చాలా రాష్ట్రాలు 50శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి విఫలమయ్యారన్నారు. ఒక్క తమిళనాడులోనే 69శాతం రిజర్వేషన్‌లు అమలు అవుతున్నాయన్నారు. తమిళనాడు తరహాలోనే రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కేంద్రంలో బిజెపిని ఒప్పించి చట్టం చేయాలన్నారు. కేంద్రాన్ని ఒప్పించే విషయంలో తమవంతు సహకారం అందిస్తామని, కానీ ఈవిషయంలో ప్రభుత్వం చొర వీసుకోవాలన్నారు.

## ఉత్తర తెలంగాణ విద్యుత్ ప్రతిపాదనలపై విచారణ

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన టారిఫ్, ఆదాయ, వ్యయాల ప్రతిపాదనలపై విద్యుత్ నియంత్రణ కమిషన్ విచారణ చేయనుంది. సవరించిన ఆదాయ, ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడి సర్ఛార్జిల ప్రతిపాదనలపై ఈ నెల 19వ తేదీన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరపనున్నట్లు సోమవారం ఒకప్రకటనలో తెలిపింది. హన్మకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం. 10:30గంటలకు ఈ బహిరంగ విచారణ ప్రారంభమవుతుంది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ పాల్గొని ఈ బహిరంగ విచారణను చేపడుతారు. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల విద్యుత్ వినియోగదారులందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయవలసిందిగా టీజీ ఎన్పీడీసీఎల్ తెలిపింది.

## బిసి బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాం

### సీఎంకు, మద్దతు పలికిన రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు : జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసిలకు విద్యా, ఉద్యోగాలతోపాటు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు రాజకీయ రిజర్వేషన్‌లను 42 శాతం పెంచుతూ సోమవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిసిబిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం.. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేసినందుకు సీఎంకి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, అలాగే బిల్లుకు బేషరతుగా మద్దతు తెలిపిన బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ పార్టీల నేతలకు సమస్త బిసి సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. బిసి బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపైన అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# అద్భుతమైన గ్రీన్ పవర్ పాలసీ తీసుకొచ్చాం

### రాష్ట్రానికి తక్కువ ధరతో కాలుష్య రహితవిద్యుత్తు

### శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, మహేష్ కుమార్ గౌడ్, కల్వకుంట్ల కవిత, భాను ప్రసాద్ ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రిగా భట్టి విక్రమార్క మల్లు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో అద్భుతమైన గ్రీన్ పవర్ పాలసీని ప్రజా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రాష్ట్రానికి తక్కువ ధరతో, కాలుష్య రహితంగా విద్యుతును అందించడమే లక్ష్యంగా సమగ్ర గ్రీన్ పవర్ పాలసీని ప్రజా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ పవర్ పాలసీకి పెట్టుబడుదారులు ఆకర్షితులై రూ. 80వేల కోట్ల నుంచి లక్ష కోట్ల వరకు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని.. ఇప్పటికే కొన్ని కంపెనీలు ఎంవోయులు చేసుకున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ రంగంలో అనేక మార్పులు వచ్చినప్పటికీ గత 10 సంవత్సరాలు ఈ రంగంలో ఒక పాలసీ లేదని సభకు చెప్పారు. 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2040 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ వంటి విభాగాల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రోజు రోజుకు విద్యుత్తు డిమాండ్ ఊహించని రీతిలో పెరుగుతుందని.. దానిని అందుకునేందుకు ప్రభుత్వ ఖాళీ భూముల్లో, దేవాదాయ శాఖ ఖాళీ భూముల్లో, సాగునీటి శాఖలో సోలార్, ఫ్లోటింగ్ సోలార్ ద్వారా గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జెన్‌కోతో ఎంవోయు చేసుకున్నామని వివరించారు. ఈ రంగాల్లో యువతను ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రానివారు బ్యాంకుల సహకారంతో స్వయం ఉపాధికి గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రిజిస్ట్రేషన్‌లో టాక్సీ ఫ్రీ చేశామని ఫలితంగా రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాల విక్రయాలు పెరిగాయని భట్టి విక్రమార్క తెలిపారు. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటనతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చారని వారు క్షేత్రస్థాయిలో సర్వే చేసుకుంటున్నారని తెలిపారు. సర్వే అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,938 మెగావాట్ల గ్రీన్‌పవర్ ఉత్పత్తి జరుగుతుందని, 2040 నాటికి 40 వేల మెగావాట్లు రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తామని తెలిపారు. దూరప్రయాణం చేసే వారిని దృష్టిలో పెట్టుకొని ఎవరైనా ముందుకు వస్తే ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్ లు పెట్టుకు నేందుకు అన్ని అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. తీవ్ర వాతావరణ కాలుష్యము మూలంగా ఢిల్లీ పట్టణ ప్రజలు ఒక సీజన్లో మూడు నెలల పాటు వలస వెళ్లిపోతున్నారు. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూడాలనే ఎలక్ట్రికల్, బ్యాటరీ బేస్డ్ బస్సులు ప్రవేశ పెడుతూ, డీజిల్ బస్సులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ సిటీలో కొత్తగా డీజిల్ ఆటోలకు అనుమతి ఇవ్వడం లేదని.. బ్యాటరీతో నడిచే ఆటోలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గ్రీన్ పవర్ పాలసీకి సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోరితే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.



గజ్వేల్-చేగుంట రహదారిపై ధర్నా చేస్తున్నన రైతులు

## సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

### గజ్వేల్ చేగుంట రహదారిపై ధర్నా,రాస్తారోకో

**గజ్వేల్(దౌల్తాబాద్) మార్చి 17, ప్రభాతవార్త :** తలాపున గోదావరి జలాలు పారుతున్నప్పటికీ తమ పంటలకు సాగు నీరు రాకపోవడంతో చేతికి వచ్చిన పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆగ్రహించిన రైతులు గజ్వేల్-చేగుంట రహదారిపై దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ చౌరస్తాలో రామాయంపేట కెనాల్‌వద్ద టెంట్ వేసి రహదారిపై కట్టెలు,ముళ్ల పొదలను అడ్డంగా వేసి సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కిలోమీటర్ల పొడువున వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దౌల్తాబాద్ మండల పరిధిలోని మాచినపల్లి, మెదక్ జిల్లా చేగుంట మండల కసాన్‌పల్లి,పోతాన్‌పల్లి, చందాయిపేట, గోసన్‌పల్లి, చిన్నశివనూర్,పెద్ద శివనూర్ తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు రోడ్డుపై భైఠాయించి పంట పొలాలకు సాగునీరు అందించాలని ఆందోళన చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్‌లు ఆందోళన కారుల వద్దకు చేరుకొని శాంతింప చేశారు. తమ గ్రామాలకు కాల్వ ద్వారా సాగునీరు అందించే వరకు కదిలే ప్రసక్తి లేదని మొండికేశారు. రైతుల సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని రైతులకు సీఐ హామీ ఇచ్చారు. కాగా రామాయంపేట కెనాల్ ద్వారా సాగునీరు అందించి రైతుల సమస్యను పరిష్కరిస్తానని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి రైతులకు హామీఇచ్చారు. జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అనంతరం రామాయంపేట కెనాల్ కాల్వను పరిశీలించారు.

# అడ్డంకిగా టిబిఎం భాగాల తొలగింపు

### టన్నెల్లోకి మరోసారి కడవర్ డాగ్ స్క్వాడ్స్

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని డీ1, డీ2 ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరం

### ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న కలెక్టర్ సంతోష్



సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యల్లో అడ్డంకిగా మారుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ యొక్క భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ, ఎస్కావేటర్, రెట్టింపు సహాయక బృందాలతో మట్టిని తొలగించే పనులు వేగవంతం చేస్తున్నారు. అదేవిధంగా బురద, నీటి తోడివేత పనులు కొన సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సోమవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, సహాయక బృందాల ఉన్నతాధికారు లతో సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారు ఉన్న ప్రదేశంగా డి1,డి2 ప్రదేశాలను గుర్తించి సహా యక చర్యలు కొనసాగిస్తూ ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేశామన్నారు. సహాయక చర్యల్లో అడ్డంకి గా మారుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ యొక్క భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ, ఎస్కావేటర్, రెట్టింపు సహాయక బృందాలతో మట్టిని తొలగించే పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, సిం గరేణి మైన్స్ రెస్క్యూ, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు డి1, డి2 ప్రదేశాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలియజేశారు. ప్రమాద ప్రదేశంలో నీటిని తొలగించేందుకు డివాటరింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని అందిస్తున్నట్లు, ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బంది భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయడంతోపాటు, సహాయక బృందాలకు అధికారులు తగిన సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. డి1, డి2 ప్రదేశాలను పరిశీలించేందుకు కడవర్ డాగ్ స్క్వాడ్స్ సోమవారం టన్నెల్లోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్,ర్యాట్ హోల్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే బృందాల అధికారులు పాల్గొన్నారు.

## పసికందును కాల్చిన గుర్తు తెలియని వ్యక్తులు

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 17, ప్రభాతవార్త:** పుట్టిన కొన్ని గంటలలోనే పసికందును నిప్పుపెట్టి కాల్చివేసిన అమానవీయ ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, దోమలగూడ పోలీసుల కథనం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ స్టేడియంలోని వెనుక గేటు వద్ద ఉన్న జీహెచ్ఎంసీ మరుగుదొడ్డి పక్కన గుర్తు తెలియని పసికందు కాలి పోయి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏసీపీ గురు రాఘవేంద్ర, దోమలగూడ సీఐ శ్రీనివాసరెడ్డిలు సిబ్బందితో కలసి ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. శిశువు ఆడ శిశువు అని, అప్పుడే పుట్టినట్లు భావిస్తున్నారు. శిశువును ఎందుకు కాల్చివేశారు, ఎక్కడ నుండి తీసుకు వచ్చారు, చనిపోయిన శిశువా లేక బతికి ఉన్న శిశువా అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆడపిల్ల అనే వివక్షతో కాల్చి వేశారా లేక కుటుంబ కలహాలతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారా అనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సీసీ ఫుటేజీల ఆధారంతో దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

## టిఆర్ఎస్ రైతు నాగలి బ్యానర్‌ను పునరావిష్కరించిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి17:** టిఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో అప్పటి టిఆర్ఎస్ రైతు నాగలి బ్యానర్‌ను సోమవారం బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేత పునరావిష్కరణ చేయించారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి, ఇతర పార్టీ నేతలు ఆనాటి పార్లమెంటరీ ఉద్యమ పంథా పోరాట జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాగా..నాటి బ్యానర్‌ను భద్రపరిచి ఉద్యమ సందర్భాన్ని మరోసారి స్మరించుకునేలా చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి బృందాన్ని అధినేత కెసిఆర్ అభినందించారు. రజతోత్సవ వేడుకల శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి, ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎంఎల్ఎ నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ సీనియర్ నేత గ్యాదరి బాలమల్లు.. తదితర ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పాల్గొన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం 27 ఏప్రిల్ 2001లో జరిగింది.

## అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి17:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను పరామర్శించారు. వంశీకృష్ణ ఇటీవల అనారో గ్యంతో ఆసుపత్రిలో చేరారు. బంజారాహిల్స్‌లో గల స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వంశీకృష్ణను ముఖ్యమంత్రి పరామర్శించారు. అనంతరం వైద్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## డీలిమిటేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదు

### 22న చెన్నైలో జరిగే డిఎంకె సమావేశానికి హాజరవుతా: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి17:** డీలిమిటేషన్ అంశంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. దేశంలో అందరికంటే ముందు డీలిమిటేషన్ వల్ల తెలంగాణకి, దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే నష్టాల గురించి మాట్లాడింది తమ పార్టీ అని గుర్తు చేశారు. డిఎంకె పార్టీ కన్నా ముందే చాలా కాలం నుంచి డీ లిమిటేషన్ వల్ల దక్షిణాదికి జరగబోయే నష్టం గురించి జాతీయ వేదికలపైన తాము మాట్లాడుతున్నామని తెలిపారు.

అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సోమవారం పిలిచిన అఖిలపక్ష సమావేశ నిర్వహణపైన, కాంగ్రెస్ పార్టీ వైఖరిపైన వారికే స్పష్టత లేదని విమర్శించారు. డీ లిమిటేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం పైన పోరాడుతామని స్పష్టం చేశారు. డీ లిమిటేషన్ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఉన్న బాధ్యత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న చెన్నైలో జరిగే డిఎంకె సమావేశానికి బిఆర్ఎస్ తరఫున తాను హాజరై తమ పార్టీ విధానాన్ని బలంగా వినిపిస్తామని తెలిపారు.

## స్టాలిన్ నిర్వహించే భేటీకి రాష్ట్ర ప్రతినిధుల బృందం: జానారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి17:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణపై తమిళనాడులో స్టాలిన్ నిర్వహించే భేటీకి రాష్ట్ర ప్రతినిధుల బృందం వెళుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి వెల్లడించారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ భేటీకి సీపీఐ, సీపీఎం,మజ్లిస్ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. బీజేపీ,బీఆర్ఎస్ గైర్హాజరైంది.సమావేశం ముగిసిన అనంతరం జానారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అంశంపై మరిన్ని సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు.తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే సభకు అన్నిపార్టీల నుంచి ఒక్కొక్కరు సమావేశానికి వెళతారని, కొన్ని పార్టీల గైర్హాజరు తాత్కాలికమేనని,భవిష్యత్తులో అందరూవస్తారని ఆయన అన్నారు.

## కారుణ్య నియామకాలలో ప్రభుత్వ స్పందన దేశానికే ఆదర్శం

### కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కారుణ్య నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వ స్పందన దేశానికే ఆదర్శంగా ఉందని తెలంగాణ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ(టిజిఈజెఏసి) అన్నారు. రాష్ట్రంలో 588 కుటుంబాలకు కారుణ్య నియామకాలను ఆమోదించిన తెలంగాణ ప్రభుత్వానికి జేఏసీ చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ గుణాత్మక మార్పు తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించారని, ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్ర మార్క, ఈ లక్ష్యాన్ని సాధించడంలోమహిళ శిశుసంక్షేమ మంత్రివర్యులు ధనసరి అనసూయ(సీతక్క) పాత్ర చాల కీలకమైందన్నారు.



## కేంద్రంపై ఢిల్లీ విమానాశ్రయం దావా..

**న్యూఢిల్లీ, మార్చి 17:** కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీ విమానాశ్రయం దావావేసింది. రక్షణశాఖకు చెందిన విమానాలను విమానాశ్రయంలోకి అనుమతించడాన్ని సవాల్ చేస్తూ జీఎంఆర్ సంస్థ దావా వేసినట్లు తెలిపింది. గజియాబాద్ విమానాశ్రయం లోకి వాణిజ్య విమానాలను అనుమతిస్తే ఢిల్లీ విమానాశ్రయం ఆర్థికంగా నష్ట పోతుందని ఆరోపిస్తూ మార్చి 10న న్యాయస్థానంలో దావా దాఖలు చేసింది. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా లేకపోతే ఒక విమానాశ్రయానికి మరో విమానాశ్ర యానికి మధ్య 150 కిలోమీటర్ల దూరం ఉండాలనే నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించిందని అధికారులు దావాలో వెల్లడించారు. ఢిల్లీఎయిర్ పోర్టుకు దాదాపు 30 కిలోమీటర్లదూరంలో ఉన్న హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌నుంచి కొనసాగుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానసర్వీసులకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోర్టును కోరారు. కాగా ఈ విషయంపై భారత పౌరవిమానయానమంత్రిత్వశాఖ స్పందించాల్సి ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయాల్లో ఢిల్లీ విమానాశ్రయం కూడా ఒకటి. గత ఏడాది సుమారు 73.6 మిలియన్లమంది ప్రయాణీకులు ఈ విమానాశ్రయం మీదుగా రాకపోకలు సాగించారు. అయితేప్రభుత్వ రుసుములు పెరగడంవల్ల సుమారు 21మిలియన్ డాలర్లు నష్టపోయింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయాల యాజమాన్యంలో జీఎంఆర్‌కు మెజార్టీ వాటా ఉంది.

# అర్జున్ S/O వైజయంతి టీజర్ లాంచ్ ఈవెంట్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా అర్జున్ S/O వైజయంతి ఫస్ట్ లుక్ పోస్టర్, ప్రీటీజర్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. విజయశాంతి ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన అర్జున్ S/O వైజయంతిని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించారు. ఈ చిత్ర టీజర్ని మేకర్స్ లాంచ్ చేశారు. ఐపీఎస్ ఆఫీసర్ విజయశాంతి విధి నిర్వహణలో నేరస్థులపై కాల్పులు జరపడంతో టీజర్ ప్రారంభమవుతుంది. చావుకి ఎదురెళ్ళిన ప్రతిసారి ఆమెకు కొడుకు అర్జున్ ముఖం గుర్తుకు వస్తుంది. వైజాగ్‌లో నేరస్థులని నియంత్రించడంలో పోలీసులు, కోర్టులు రెండూ విఫలమైనప్పుడు, అర్జున్ పరిస్థితిని తన చేతుల్లోకి తీసుకుంటాడు. చట్టాన్ని ధిక్కరించే ఎవరినీ శిక్షించకుండా ఉండనివ్వనని విజయశాంతి చెప్పడం, అర్జున్ అమ్మకు బర్త్ డే విషెష్ చెప్పడంతో టీజర్ ఎండ్ అవ్వడం చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. అర్జున్ S/O వైజయంతిలో దర్శకుడు ప్రదీప్ చిలుకూరి యాక్షన్, డ్రామా, భావోద్వేగాలను అద్భుతంగా బ్లెండ్ చేశాడు. మదర్ డ్యూటీ, కొడుకు కోపం, మంచి, చెడుల మధ్య ఒక ఎపిక్ స్టోరీగా ప్రెజంట్ చేశాడు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో లేడి సూపర్ స్టార్ విజయశాంతి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఈ కథ నాకు చాలా నచ్చింది. కళ్యాణ్ రామ్ నిజంగానే రాముడు లాంటి బాలుడు. తనకి చాలా మంచి మనసుంది. చాలా ఆప్యాయంగా చూసుకున్నారు. ఎక్కడా ఇబ్బంది కలిగించకుండా సినిమా త్రూ అవుట్ కేర్ తీసుకున్నారు. ఈ సినిమాతో నాకు బాబుకి చాలా చక్కటి బాండ్ ఏర్పడింది. సరిలేరు నీకెవ్వరు తర్వాత ఒక యాక్షన్ సినిమా చేయమని చాలామంది కోరారు. ఈ సినిమాలో అలాంటి యాక్షన్ కుదిరింది. నా అభిమానులకి ఈ సినిమాతో ఫుల్ మీల్స్ దొరుకుతుందని భావిస్తున్నాను అన్నారు. హీరో నందమూరి కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ, తెలుగు ప్రేక్షకులకు, నందమూరి అభిమానులకు నా హృదయపూర్వక నమస్కారాలు. అమ్మ (విజయశాంతి) చేసిన కర్తవ్యం సినిమాని ఎవరు మర్చిపోలేం. ఈ సినిమా కథని డైరెక్టర్ ప్రదీప్ చెప్తుంటే కర్తవ్యం సినిమాలో వైజయంతి క్యారెక్టర్‌కి కొడుకు పుడితే ఎలాంటి ఇన్సిడెంట్స్ జరుగుతాయి అనేది ఈకథ అన్నారు. అయితే అమ్మ ఒప్పుకుంటేనా ఈ సినిమా చేద్దామని అన్నాను. ఈ సినిమా మెయిన్ పిల్లర్ అమ్మ. ఈవయసులో కూడా అమ్మ ఎలాంటి డూప్‌లేకుండా అద్భుతమైనటువంటి స్టన్స్ చేశారు. పృథ్వీ చాలా అద్భుతమైనటువంటి క్యారెక్టర్‌చేశారు. యానిమల్ సినిమా ఎంత పేరు తీసుకొచ్చిందో, తెలుగులో ఈ సినిమా అంతా గుర్తింపు తెస్తుందని ఆయన మొదటి రోజు నుంచి చెప్పారు. ఈ సినిమాకి ఆయనే డబ్బింగ్ చెప్పారు. మా ప్రొడ్యూ సర్స్ ఎక్కడా కాంప్రమైజ్ అవ్వలేదు. సినిమా పాజిటివ్ యాటిట్యూడ్‌తో చేయడం జరిగింది.



# 21న 'టుక్ టుక్' రిలీజ్




ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం టుక్ టుక్. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని, ఆర్ వై జి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డిలు ఈచిత్రాన్ని నిర్మించారు. మార్చి 21న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు సోమవారం సుప్రీత్ కృష్ణ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి. **ఈ సినిమా ద్వారా ఏం చెప్పాలనుకుంటున్నారు?** ఓ క్రికెట్ యాడ్‌లో ఓ వెహికల్ చూసినప్పుడు కలిగిన ఆలోచన ఇది. వెహికల్‌కు లైఫ్ ఉంటే ఎలా ఉంటుంది అనే ఆలోచన నుంచి వచ్చిన కథ ఇది. ఈ అంశానికి కమర్షియల్ ప్యాకేజీని కలిపి చేసిన చిత్రం టుక్ టుక్. **గతంలో వచ్చిన బొమ్మ బొట బంగారు బొట, మెకానిక్ మామయ్య, కారు దిద్దిన కాపురం చిత్రాలకు ఈ చిత్రానికి ఏమైనా పోలిక ఉంటుందా?** పోలిక ఏమీ లేదు. ఆ సినిమాల నుంచి ప్రేరణ పొందలేదు. ఇది కంప్లీట్ వర్జినల్ స్టోరీ. **ఆర్టిస్టుల ఎంపిక ఎలా జరిగింది?** సినిమాలో ముగ్గురు టీనేజ్‌అబ్బాయిలు అవసరం అందుకే హర్ష, కార్తికేయ, మధును తీసుకున్నాను. అడిషన్ చేసి తీసుకున్నాను. వర్క్ షాప్స్ జరిపి చిత్రీకరణ చేశాం. **అసలు ఈ కథాంశం ఏమిటి?** చిత్తూరు నేపథ్యంలో 90 నుండి 20వ దశకంలో జరిగే స్టోరీ. టుక్ టుక్ టైటిల్ వెనుక కూడా ఓ కథ ఉంది. సౌండ్‌ని టైటిల్‌గా పెట్టాలని పెట్టాం. మూవీ చూస్తే తెలుస్తుంది. దీనికి టైటిల్ ఎందుకు పెట్టారు అనే దానికి ఓ అర్థం వుంటుంది. నా నేటివిటి చిత్తూరు నేపథ్యం కావడం నాకు ఈ సినిమాకు ప్లస్ అయ్యింది. ఈ సినిమాలో వెహికల్ పాత్రను ఎలా డిజైన్ చేశారు. గతం, వర్తమానం, భవిష్యత్ అన్ని తెలిసిన స్కూటర్. మనం ఏదైనా ప్రశ్న అడిగితే దానికి తనదైన శైలిలో సమాధానం చెబుతుంది. ట్రైలర్‌లో చూసినట్టుగానే చిన్న హ్యూమర్ కోసం ఆ వెహికల్ ఉంటుంది. కానీ ఆ వెహికల్ వెనుక మంచి ఎమోషన్ ఉంటుంది. **రోషన్ నటించిన కోర్టు హిట్ అవ్వడం మీకు ఎంత వరకు ప్లస్ అవుతుందని అనుకుంటున్నారు?** కోర్టుతో పాటు మా సినిమాపై కూడా రోషన్ మంచి నమ్మకంతో ఉన్నాడు. సినిమా హిట్ అవ్వడం, కోర్డు హిట్‌అవ్వడం మా మూవీకి కూడా ప్లస్ అవుతుంది. **ఈ చిత్రంలో టుక్‌టుక్ వెహికల్ కాకుండా ఇంకా హైలైట్స్ ఏమిటి?** ఫాంటసీ మ్యాజికల్ పవర్స్ ఉన్నాయి. వెహికల్ కాకుండా ఈ చిత్రంలో చాలా లేయర్స్ ఉన్నాయి. టుక్ టుక్ వెనకలా ఉందేమిటి? అది దెయ్యమా? దేవుడా అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది.

# 'కపుల్ ఫ్రెండ్లీ' షూటింగ్ కంప్లీట్

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీగా తెరకెక్కుతున్న "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుంది. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా టైటిల్ కొత్తగా ఉండి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ సినిమా వీడియో గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఆడియెన్స్‌కు ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పిరియన్స్ ఇవ్వనుంది. ఈ సినిమా తెలుగు తమిళ ఆడియో రైట్స్‌ను ఆదిత్య మ్యూజిక్ తీసుకుంది. త్వరలోనే "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా తెలుగు, తమిళ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నటీనటులు సంతోష్ శోభన్, మానస వారణాసి, తదితరులు



టెక్నికల్ టీమ్: ఆర్ట్: మైఖేల్ బీఎఫ్ఏ, ఎడిటర్: గణేష్ శివ, డీవోపీ: దినేష్ పురుషోత్తమన్, మ్యూజిక్: ఆదిత్య రవీంద్రన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ఎస్ వర్మ, సమర్పణ: యూవీ క్రియేషన్స్, నిర్మాణం:యూవీ కాన్సెప్ట్స్, అజయ్ కుమార్ రాజు. పి., పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), రచన, దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్.

# ఆది కెరీర్‌ను మలుపు తిప్పే 'షణ్ముఖ'

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ షణ్ముఖ. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సన్సేషనల్ సంగీత దర్శకుడు రవి బసూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు రవి బసూర్ మాట్లాడుతూ, శాసనసభ సమయంలో నాకు పరిచయమైన షణ్ముగం సాప్పని కోసం ఈ సినిమాచేశాను. ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా చేయాలనే తపన అతనిలో కనిపిస్తుంది. హీరో ఆది నటన అందర్ని ఆకట్టుకుంటుంది. ఆదికి ఈ సినిమా కెరీర్‌లో మంచి సినిమాగా ఉండాలని



కోరుకుంటున్నాను అన్నారు. ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ, షణ్ముఖ ఈ టైటిల్‌లోనే ఎంతో ప్రత్యేకతఉంది. ఆది కెరీర్‌కు మలుపుతిప్పే సినిమాలా ఉండాలని కోరుకుంటున్నాను. గొప్ప నటుడు సాయికుమార్ వారసుడిగా ఆదికి మంచి పేరు ఉంది. ఈ సినిమాలోని నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అందరికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. షణ్ముఖ టైటిల్‌కు తగ్గట్టుగా దర్శకుడు షణ్ముగం ఈ చిత్రం చూపించాడు.

# '12ఎ రైల్వే కాలనీ' టైటిల్, టీజర్ విడుదల

అల్లరి నరేష్ బోల్డ్ అండ్ యూనిక్ ప్రాజెక్ట్స్‌తో అలరిస్తున్నారు. తన అప్ కమింగ్ ప్రాజెక్ట్ మరొక ఎక్స్‌యిటింగ్ డిఫరెంట్ మూవీ అవుతుందని హామీ ఇస్తుంది. పొలిమేర, పొలిమేర 2 చిత్రాలతో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్, ఈ ప్రతిష్టాత్మక వెంచర్‌కు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ నాని కాసరగడ్డ దర్శకత్వంతో పాటు ఎడిటింగ్‌ని నిర్వహిస్తారు. ఈ సినిమా టైటిల్‌ను ఒక స్పైన్ చిల్లింగ్ టీజర్ ద్వారా రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 12ఎ రైల్వే కాలనీ అని ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు, టీజర్ సినిమా కథను గ్లింప్స్ లా ప్రజెంట్ చేసింది. అల్లరి నరేష్ ఒక కిటికీ దగ్గర నిలబడి, ఆలోచనలో, ధ్యాన ముద్రలో కనిపించడంతో టీజర్ బిగెన్ అవుతుంది. వైవా హర్ష వాయిస్ ఓవర్‌లో కొంతమందికి మాత్రమే ఆత్మలు ఎందుకు కనిపిస్తాయో, రాబోయే అతీంద్రియ అంశాలను ఎందుకు సూచిస్తుందో ప్రశ్నిస్తుంది. టీజర్ వింతైన, కలవరపెట్టే సంఘటనలు ఎక్స్‌యిటింగ్‌గా వున్నాయి, ప్రతి పాత్ర కూడా అనుమానాస్పదంగా వుంది. అల్లరి నరేష్ పాత్ర ఒకరిని షూట్ చేసి నవ్వడం ప్రేక్షకులను ఆ పాత్ర గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించేలా వుంది. అల్లరి నరేష్ డిఫరెంట్ షేడ్స్‌తో మరో ఆసక్తికరమైన పాత్రను పోషించగా, పొలిమేరా సిరీస్ ఫేమ్ డాక్టర్ కామాక్షిభాస్కర్ల కథానాయికగా నటించారు. సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనిష్ కురువిల్లా మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ కుశేందర్ రమేష్ రెడ్డి, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో క్వాలిటీ వర్క్ టైటిల్‌టీజర్‌లోస్ట్రాంగ్ ఇంపాక్ట్‌ని క్రియేట్ చేశాయి.



# 'కిస్ కిస్ కిస్సిక్' ప్రిరిలీజ్

మోస్ట్ ఎవైటెడ్ హోల్సమ్ ఎంటర్‌టైనర్ కిస్ కిస్ కిస్సిక్ ప్రామెసింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. శివ్ హరే దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శుశాంత్, జాన్య జోషి, విధి వంటి న్యూ ట్యాలెంట్ పరిచయం అవుతుండగా, విజయ్ రాజ్, మురళీ శర్మ వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని గణేష్ ఆచార్య భార్య విధి ఆచార్య (వి2ఎస్ ప్రొడక్షన్) నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన గణేష్ ఆచార్య స్వయంగా కొరియోగ్రఫీ చేస్తున్నారు. అద్భుతమైన ట్రాక్ రికార్డ్ వున్న మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మల్టీ లాంగ్వేజ్‌లో గ్రాండ్ రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈచిత్రం మార్చి 21న తెలుగు, తమిళం,మలయాళం, కన్నడ భాషల విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రిరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ప్రెస్ మీట్‌లో గణేష్ ఆచార్య మాస్టర్ మాట్లాడుతూ, నన్ను, ఈ సినిమాని సపోర్ట్ చేసిన మైత్రీ మూవీ మేకర్స్ నవీన్‌కి, రవికి థ్యాంక్ యూ. వారు నాకు చాలా ప్రేమని ఇచ్చారు. పుష్ప 1, పుష్ప 2 ఈ రెండు చిత్రాలు కలిపి దాదాపు ఐదేళ్ళు వాళ్ళ కంపెనీలో పని చేశాను. వాళ్ళతో వర్క్ చేస్తున్నపుడు ఫ్యామిలీతో వర్క్ చేసినట్లుగానే వుంటుంది. ప్రతిది ప్లాన్‌గా చేస్తారు. ప్రతిది రెడీగా వుంటుంది. నేను వర్క్ చేసిన బెస్ట్ కంపెనీ ఇది. పుష్ప కిస్ కిస్ కిస్సిక్ సాంగ్ బిగ్ హిట్. ఇదే టైటిల్‌తో ఈ సినిమా మార్చి 21న వస్తోంది. ఇందులో చాలా బ్యూటీఫుల్ కాన్సెప్ట్ వుంది. యాక్షన్ రియల్ షతీస్ చేశారు. తొమ్మిది పాటలు వున్నాయి. న్యూ ట్యాలెంట్ ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. వీళ్ళకి ఎలాంటి సినీ నేపథ్యం లేదు. చాలా కష్టపడి వర్క్ చేశారు. ట్రైలర్‌లో ప్రూవ్ చేసుకున్నారు. తెలుగు సినిమా నాకు చాలా నచ్చింది. బన్నీ, చరణ్, ఎన్టీఆర్, చిరంజీవి లాంటి బిగ్ స్టార్స్‌తో వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఇక్కడ నటులకు, టెక్నిషియన్స్‌కి గొప్పగా గౌరవిస్తారు. తెలుగు చిత్ర పరిశ్రమ నాకు చాలా ఇష్టం. మార్చి 21న ఈ సినిమాని థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను. ఇది ఫ్యామిలీ ఫిల్మ్. యాక్షన్ రోమాన్స్ సాంగ్స్ అన్నీ అలరిస్తాయి. సినిమా హిందీ తెలుగు తమిళ్ కన్నడ మలయాళం భాషలో అందుబాటులో వుంది. తప్పకుండా సినిమా చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా మేము చేయడానికి ప్రధాన కారణం గణేష్ ఆచార్య మాస్టర్. గణేష్ ఆచార్య మాస్టర్‌తో మాకు చాలా మంచిఅసోసియేషన్ ఉంది. మాకు చాలా సినిమాలు చేశారు. ఈ సినిమా రషెస్ చూశాను చాలా అద్భుతంగా ఉన్నాయి.






# యంగ్ బ్యూటి మీనాక్షీ చౌదరి

యంగ్ బ్యూటి మీనాక్షిచౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఇచట వాహనాలు నిలుపరాదు'సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి.. అతి తక్కువ టైంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. అలాగే తన అందం, అభినయంతో ప్రేక్షకుల్లో మంచి ఫేమ్ తెచ్చుకుంది. రీసెంట్‌గా మీనాక్షి టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ మూవీలో హీరోయిన్ ఐశ్వర్య రాజేష్కూడా నటించారు. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించింది. అలా ఓ పక్క సినిమాలతో మరోపక్క నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ మీనాక్షి తన లేటెస్ట్ ఫొటోస్‌లతో పాటు వ్యక్తిగత విషయాలను షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఈ భామ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టింది. అందులో ట్రావెన్ కౌర్‌తో చాలా సన్నిహితంగా ఉన్న ఫొటోను షేర్ చేస్తూ.. 'హ్యాపీ బర్త్‌డే.. నీకు ఈ సంవత్సరం బెస్ట్ ఇయర్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మిస్ యూ' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు మేము నిన్ను మిస్ అవుతున్నామని కామెంట్స్ చేస్తున్నారు.



# 27న 'ఎల్2 ఎంపురాన్'

కంప్లీట్ యాక్టర్ మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమార్ తెరకెక్కించిన లూసిఫర్‌కు సీక్వెల్‌గా 'ఎల్2 ఎంపురాన్'ను రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మార్చి 27న రిలీజ్ చేయబోతోన్నారు. మురళి గోపి అందించిన ఈ కథను లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై సుబాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. మోహన్ లాల్ ఖురేషిఅబ్రామ్ అలియా స్టీఫెన్ నెడుంపల్లిగా తెరపైకి రాబోతోన్నారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, టోవినో థామస్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ ఫేమ్ జెరోమ్ ఫ్లిన్, అభిమన్యు సింగ్, ఆండ్రియా తివాదర్, సూరజ్ వెంజరమూడు, ఇంద్రజిత్ సుకుమారన్, మంజు వారియర్, సానియా అయ్యప్పన్, సాయికుమార్, బైజు సంతోష్, ఫాజిల్, సచిన్ ఖేదేకర్, నైలా ఉష, గిజు జాన్, నందు, శివాజీ గురువాయూర్, ఎస్ మణికుట్టన్, మణికుట్టన్, మణికుట్టన్ ఉన్నారు. ఓఖినెల్, ఎరిక్ ఎబౌనీ, మిఖాయిల్ నోవికోవ్, కార్తికేయ దేవ్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషిం చారు. అక్టోబర్ 5, 2023న ఫరీదాబాద్‌లో ఈ మూవీ షూటింగ్ గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత సిమ్లా, లేహ్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, చెన్నై, గుజరాత్, హైదరాబాద్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ముంబై, కేరళతో సహా పలు ప్రదేశాలలో షూటింగ్ జరిగింది. 1:2.8 రేషియోతో అనమోర్ఫిక్ ఫార్మాట్‌లో ఈ చిత్రాన్ని రూపొందిం చారు. సినిమాటోగ్రాఫర్ సుజిత్ వాసుదేవ్, ఎడిటర్ అఖిలేష్ మోహన్, ఆర్ట్ డైరెక్టర్ మోహన్ దాస్, స్టంట్ డైరెక్టర్ స్టంట్ సిల్వా, క్రియేటివ్ డైరెక్టర్ నిర్మల్ సహదేవ్, మ్యూజిక్ డైరెక్టర్ దీపక్ దేవ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కాను న్నారు. జనవరి 26న రిపబ్లిక్ డే సంద ర్భంగా రిలీజ్ చేసిన టీజర్ అందరినీ ఆశ్చర్య పరిచింది. ఫిబ్రవరి 9న సినిమాలోని పాత్రను పరిచయం చేస్తూ వదిలిన గ్లింప్స్ అందరినీ మెప్పించింది. ఆశీర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ యూట్యూబ్ ఛానెల్‌లలో గత కొన్ని రోజులుగా సినిమా లోని అన్నిపాత్రలను రివీల్‌చేస్తూ వదిలిన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫిబ్రవరి 26న ఖురేషిఅబ్రహాం అలియాస్ స్టీఫెన్ నేడుంపల్లిగా మోహన్‌లాల్ పాత్రను గ్రాండ్‌గా రివీల్ చేయడంతో అభిమానులలో అంచనాలను మరింతపెంచింది. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని మార్చి 27న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ హై ఆక్టేన్, స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం అభిమానులంతా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే.



# ఐపిఎల్ 2025లో డేంజరస్ ప్లేయర్లు

## బరిలో బౌలర్లకు చుక్కలే



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ క్రికెటర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఐపిఎల్ వేదిక సిద్ధమవుతోంది. అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఐపిఎల్-2025 సీజన్ మరో నాలుగు రోజుల్లో ప్రారంభమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఈ నెల 22న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడి యంలో జరిగే మ్యాచ్‌తో ఈ సీజను ప్రారంభ మవుతుంది. ఈ సీజన్‌లో ఐదుగురు డేంజరస్ ప్లేయర్లు రంగంలోకి దిగుతున్నారు. ఐపిఎల్‌లో అందరి దృష్టి ఎడమచేతి వాటం తుఫాన్ బ్యాట్స్‌మన్, చురుకైన వికెట్ కీపర్ రిషబ్ పంత్‌పై ఉంటుంది. ఐపిఎల్ మెగా వేలంలో రిషబ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రూ.27 కోట్లకు కొనుగోలు చేయడమే కాకుండా కెప్టెన్సీ కూడా కట్టబెట్టింది. కెప్టెన్సీతో పాటు, రిషబ్ కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకో నున్నాడు. అతడు 111 ఐపిఎల్ మ్యాచ్‌ల్లో 35.31 సగటుతో 3284 పరుగులు చేశాడు. రిషబ్ పంత్ ఐపిఎల్‌లో 1 సెంచరీ, 18 హాఫ్ సెంచరీలు చేశాడు. తన ఐపిఎల్ కెరీర్‌లో వికెట్ల వెనుకాల 75 క్యాచ్‌లు పట్టడమే కాకుండా, రిషబ్ 23 స్టంపింగ్‌లు కూడా చేశాడు. ఇప్పుడు కూడా బ్యాట్‌తో తుఫాను సృష్టించే పనిలో ఉన్నాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మెగా వేలంలో శ్రేయాస్ అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపిఎల్ 2024లో శ్రేయాస్ తన కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. అయితే తదుపరి నైట్ రైడర్స్, శ్రేయాస్ విడిపోయారు. శ్రేయాస్ గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టైటిల్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ తరపున శ్రేయాస్ 5 మ్యాచ్‌ల్లో 48.60 సగటుతో 243 పరుగులు చేశాడు. ఈ పరిస్థితిలో శ్రేయాస్ ఈ ఐపిఎల్‌లో తన బ్యాట్‌తో తుఫాను సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఆస్ట్రేలియా ప్రపంచ కప్ విజేత కెప్టెన్ పాట్ కమ్మిన్స్ ఈ ఐపిఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు. గాయం కారణంగా ఆస్ట్రేలియా తరపున ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడలేకపోయాడు. కమ్మిన్స్ ప్రమాదకరమైన ఫాస్ట్ బౌలర్ మాత్రమే కాకుండా, తెలివైన కెప్టెన్ కూడా. కమ్మిన్స్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ ఐపిఎల్ 2024 ఫైనల్‌కు చేరుకుంది. కానీ, టైటిల్ మ్యాచ్‌లో, కోల్‌కతా నైట్ రైడర్స్ 8 వికెట్ల తేడాతో ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. గత ఐపిఎల్ సీజన్‌లో పాట్ కమిన్స్ 18 వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు సన్‌రైజర్స్‌ను ఛాంపియన్‌గా మార్చడానికి పాట్ కమ్మిన్స్ పట్టుదలతో ఉన్నాడు. మరో ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ రచిన్ రవీంద్ర స్పిన్ బౌలింగ్‌లో కూడా నిష్ణాతుడు. ఈ యువ ఆటగాడు ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో తనదైన ముద్ర వేశాడు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్ తరపున రచిన్ 4 మ్యాచ్‌ల్లో 65.75 సగటుతో 263 పరుగులు చేశాడు. ఇటువంటి నేపథ్యంలో రచిన్ ఈ ఐపిఎల్‌లో తన బ్యాట్‌తో తుఫాను సృష్టించే పనిలో పడ్డాడు. మెగా వేలంలో రచిన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.4 కోట్లకు కొనుగోలు చేసింది. చెన్నై తరపున రచిన్ రవీంద్ర నంబర్3 స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఇక ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన 24 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఉమర్జాయ్ ఈ ఐపిఎల్‌లో బంతి, బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాడు. అజ్మతుల్లా తుఫాన్ బ్యాటింగ్‌తో పాటు, ప్రాణాంతకమైన ఫాస్ట్ బౌలింగ్‌లో కూడా నిష్ణాతుడు. మెగా వేలంలో, అతడిని పంజాబ్ కింగ్స్ రూ.2.4 కోట్లకు కొనుగోలు చేసింది.




## మాస్టర్స్ లీగ్ ఛాంపియన్‌గా భారత్

### మరోసారి అదరగొట్టిన మాస్టర్ బ్లాస్టర్

### వెస్టిండీస్‌పై 6 వికెట్ల తేడాతో టైటిల్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్-2025 ఫైనల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, వెస్టిండీస్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి తొలిసారి భారత్ టైటిల్ గెలుచుకుంది. దీంతో ఇండియా మాస్టర్స్ క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించినట్లయింది. అంబటి రాయుడు 74 పరుగులతో అద్భుతంగా ఆడగా, యువరాజ్ సింగ్, స్టూవర్ట్ బిన్నీ కలిసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. వెస్టిండీస్ 148/7 స్కోరు చేయగా, వినయ్ కుమార్ 3 వికెట్లు తీసి కీలక పాత్ర పోషించాడు. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 149 పరుగుల లక్ష్యాన్ని ఇండియా 17.1 ఓవర్లలోనే ఛేదించింది. అంబటి రాయుడు తన అద్భుతమైన బ్యాటింగ్‌తో (50 బంతుల్లో 74 పరుగులు, 9 ఫోర్లు, 3 సిక్సులు) విజయాన్ని సునాయాసంగా అందించాడు. యువరాజ్ సింగ్ (13 నాటౌట్), స్టూవర్ట్ బిన్నీ (15 నాటౌట్) కలిసి చివర్లో జట్టును విజయతీరానికి చేర్చారు. టాస్ గెలిచి బ్రియాన్ లారా నేతృత్వంలోని వెస్టిండీస్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇండియా బౌలర్లు తమ అద్భుతమైన ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టును 148/7 స్కోరుకే పరిమితం చేశారు. వినయ్ కుమార్ (3 ఓవర్లు, 26 పరుగులు, 3 వికెట్లు), షాబాజ్ నదీమ్ (4 ఓవర్లు, 12 పరుగులు, 2 వికెట్లు) తో ఈ ఇద్దరూ కీలక వికెట్లు తీసి వెస్టిండీస్ జట్టును 150 పరుగుల కంటే తక్కువకే పరిమితం చేశారు. వెస్టిండీస్‌లో లెండిల్ సిమ్మన్స్ (41 బంతుల్లో 57), డ్వేన్ స్మిత్ (35 బంతుల్లో 45) తప్ప ఎవరూ బాగా రాణించలేకపోయారు. చివర్లో సిమ్మన్స్, దినేష్ రామ్‌దిన్ (12 నాటౌట్) కలిసి 61 పరుగుల భాగస్వామ్యం అందించినా, పెద్ద స్కోరు చేయడంలో వెస్టిండీస్ విఫలమైంది. ఈ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ 18 బంతుల్లో 25 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్స్) చేశాడు. బ్రియాన్ లారా తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడంతో, డ్వేన్ స్మిత్ (35 బంతుల్లో 45) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఒకానొక దశలో వెస్టిండీస్ మాస్టర్స్ 180+ స్కోరు చేయగలదనిపించింది. కానీ వినయ్ కుమార్, నదీమ్‌జంటకలిసి విండీస్ బ్యాటింగ్ యూనిట్‌ను నిలువరించాయి. వినయ్ తొలుత బ్రియాన్‌లారా (6)ను అవుట్‌చేసి, చివర్లో టాప్ స్కోరర్ లెండిల్ సిమ్మన్స్ వికెట్‌తీసి మ్యాచ్‌ను భారత్‌కు మళ్లించాడు. నదీమ్ స్మిత్‌ను అవుట్ చేయడంతో, విండీస్ 150 పరుగులలోపే ఆగిపోయింది.

## వెల్స్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ సెమీఫైనల్లో అల్‌కరాజ్ ఓటమి

**న్యూఢిల్లీ:** హ్యాట్రిక్ సాధించాలనే లక్ష్యంతో ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అలకరాజ్‌కు నిరాశ ఎదురైంది. గత రెండేళ్లు చాంపియన్‌గా నిలిచిన అలకరాజ్ ఈసారి సెమీఫైనల్లోనే ఇంటిదారిపట్టాడు. ప్రపంచ 14వ ర్యాంకర్, బ్రిటన్ ప్లేయర్ జేక్ డ్రేపర్ అద్భుత ఆట తీరుతో అలకరాజ్ ఆట కట్టించి తన కెరీర్‌లో తొలిసారిగా మాస్టర్స్ సిరీస్‌టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. కాలిఫోర్నియాలో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో సెమీఫైనల్లో 13వ సీడ్ డ్రేపర్ 6-1,0-6,6-4తో రెండో సీడ్ అలకరాజ్‌ను బోల్తా కొట్టించాడు. ఈ విజయంతో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ విడుదలచేసినర్యాంకింగ్స్‌లో డ్రేపర్ తొలిసారి టాప్-10లోకి దూసుకువచ్చాడు. 23 ఏళ్ల డ్రేపర్ గత ఏడాది వియన్నాఓపెన్, స్టుట్‌గార్ట్‌ఓపెన్లలో విజేతగా నిలిచాడు. ఫైనల్లో 12వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన హోల్గర్ రూనేతో డ్రేపర్ తలపడనున్నాడు. తొలి సెమీఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ రూనే 7-5, 6-4తో ఐదోసీడ్, రష్యాకుచెందిన మెద్వెదెవ్‌పై గెలిచాడు. అలకరాజ్‌పై డ్రేపర్ ఈసారి పూర్తి ఆధిపత్యం కనబరిచాడు.

## ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి ఛాంపియన్‌గా నోరిస్



**న్యూఢిల్లీ:** గత సీజన్‌ను గెలుపుతో ముగించిన మెక్లారెన్ టీమ్ డ్రైవర్ లాండో నోరిస్ కొత్త సీజన్‌ను కూడా విజయంతో ప్రారంభించాడు. ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి ఛాంపియన్‌ల భాగంగా 2025 ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌కు సంబంధించి మల్‌బోర్న్‌లో జరిగిన తొలి రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో బ్రిటన్‌కు చెందిన 25 ఏళ్ల లాండో నోరిస్ చాంపియన్‌గా నిలిచాడు. పోల్ పొజిషన్‌తో రేసును ఆరంభించిన నోరిస్ నిర్ణీత 57 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1గంట 42 నిమిషాల 06.304 సెకన్లలో పూర్తిచేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. గత నాలుగేళ్లుగా ప్రపంచ టైటిల్ సాధిస్తున్న వెల్‌స్టాపెన్ రెండో స్థానంలో నిలిచాడు. వెర్‌స్టాపెన్ రేసును 1 గంట 42 నిమిషాల 07.199 సెకన్లలో ముగించాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానాన్ని పొందాడు. 1987లో ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి మొదలు కాగా, ఈ రేసు కంటే ముందు వరకూ ఫెరారీ జట్టు డ్రైవర్లు అత్యధికంగా 11 సార్లు విజేతగా నిలిచారు. అయితే ఈసారి ఫెరారీ జట్టుకు ఈ రేసు కలిసి రాలేదు. తొలిసారి ఫెరారీ జట్టు తరఫున బరిలోకి దిగిన మాజీ వరల్డ్ చాంపియన్ లూయిస్ హామిల్టన్ 10వ స్థానంలో నిలువగా, మరో డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ 8వ స్థానాన్ని సంపాదించాడు. కాగా 2010తర్వాత తొలిసారి ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రికి వర్షం అంతరాయం కలిగించింది. వాన కారణంగా ఈ రేసుకు మూడు సార్లు బ్రేక్ పడింది. మూడు సార్లు ట్రాక్‌పై సేఫ్టీ కార్లు వచ్చాయి. తొలి ల్యాప్ పూర్తికాక ముందే ముగ్గురు డ్రైవర్లు కార్లోస్ సెయింజ్ (విలియమ్స్), జాక్ దూ హాన్ (ఆల్పన్), ఐజాక్ హద్జార్ (రేసింగ్ బుల్స్) రేసు నుంచి వైదొలిగారు. ఫార్మేషన్ ల్యాప్‌లో హద్జార్ తప్పుకోగా, తొలి ల్యాప్‌లో పరస్పరం ఢీకొట్టు కోవడంతో గత ఏడాది ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన సెయింజ్‌తోపాటు, దూహాన్ నిష్క్రమించాడు. ఆతర్వాత అలోన్సో (ఆస్టన్ మార్టిన్) 32వ ల్యాప్‌లో, గాబ్రియేల్ బోర్టోలెటో (కిక్ సాబెర్) 45వ ల్యాప్‌లో, లియామ్ లాసన్ (రెడ్‌బుల్) 46వ ల్యాప్‌లో తప్పుకున్నారు.

## పాకిస్థాన్‌లో మహిళల వన్డే వరల్డ్ కప్

### వచ్చే నెల 9 నుండి 19 వరకూ టోర్నీ

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 పాకిస్థాన్‌లో జరిగింది. ఇప్పుడు ఈ దేశం వచ్చే నెలలో మరో పెద్ద ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) టోర్నీకి ఆతిథ్యం ఇవ్వబోతోంది. మహిళల వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయర్ షెడ్యూల్‌ను ఐసిసి ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నమెంట్ లాహోర్‌లోని రెండు మైదానాల్లో జరుగుతుంది. మొదటి మ్యాచ్ ఏప్రిల్ 9న, ఫైనల్ అదే నెల 19న జరుగుతుంది. ఈ టోర్నమెంట్‌లో 6 జట్లు పాల్గొంటాయి. అందులో రెండు జట్లు అక్టోబర్, నవంబర్‌లో భారతదేశంలో జరిగే ప్రధాన ఈవెంట్‌కు అర్హత సాధించాలి. ఐసిసి ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ (2022-25)లో టాప్ 6లో నిలిచి ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఆతిథ్య భారతదేశం ఇప్పటికే ప్రపంచ కప్‌కు అర్హత సాధించాయి. మహిళల వన్డే ప్రపంచ కప్ క్వాలిఫైయర్‌లో నాలుగు పూర్తి సభ్య దేశాలు బంగ్లాదేశ్, ఐర్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ అసోసియేట్ దేశాలు స్కాట్లాండ్, థాయిలాండ్‌లతో కలిసి పోటీపడతాయి. ఈ టోర్నమెంట్ 15 మ్యాచ్‌లను కలిగి ఉంటుంది. ఐసిసి ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్, ఐర్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ ఏడవ నుండి పదో స్థానంలో నిలిచి క్వాలిఫయర్స్‌కు చేరుకున్నాయి.

# వాణిజ్యం

## పదేళ్లలో రూ.16.35 లక్షల కోట్లు రైటాఫ్..



**న్యూఢిల్లీ, మార్చి 17:** గడచిన పదేళ్లలో రూ.16.35 లక్షల కోట్ల మొండి బాకీలను బ్యాంకులు రైటాఫ్ చేసినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడిం చింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.2,36,265 కోట్లు సాంకేతికంగా రద్దు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం లో కనిష్ఠంగా రూ.58,786 కోట్ల మొండి బాకీలను రైటాఫ్ చేసినట్లు పేర్కొన్నారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,70,270 కోట్లు, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.2,16,324 కోట్లు చొప్పున బ్యాంకులు రద్దు చేసినట్లు తెలిపారు. భారత రిజర్వ్ బ్యాంకు మార్గదర్శ కాలు, బ్యాంకు బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం నాలుగు సంవత్సరాలు పూర్తయిన నిరర్ధక ఆస్తులను (ఎన్‌పిఎ) బ్యాంకులు రైటాఫ్ చేస్తాయంటూ ఓ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రైటాఫ్ చేసినంత మాత్రాన రుణ గ్రహీతలకు ఊరట కల్పించినట్లు కాదని చెప్పారు. రుణాల తిరిగి వసూలుకు బ్యాంకులు వివిధ మార్గాలను అనుసరిస్తాయని తెలిపారు. సివిల్ కోర్టుల్లో దావా వేయడం, రుణ రికవరీ ట్రిబ్యునళ్లను ఆశ్రయించడం, ఎన్‌సిఎల్‌టి ఆశ్రయించడం వంటి పద్ధతులను అనుసరిస్తా యని తెలిపారు. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం, 2024డిసెంబరు 31నాటికి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు 29 కంపెనీలను ఎన్‌పిఎలుగా గుర్తించినట్లు మంత్రి తెలిపారు. వాటిలో ప్రతి ఒక్కటి రూ.1000 కోట్లకు పైగా బకాయిలు కలిగి ఉన్నాయని చెప్పారు. వీటి విలువ రూ.61,027 కోట్ల పైమాటేనని తెలిపారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేశామని, సిఫార్సులు ఆధారంగా ఆర్థికంగా ఎంత మేర ప్రభావం పడుతుందనేది తెలుస్తుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 17:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాల్లో ముగి సాయి. గత వారం నష్టాల్లో ట్రేడయిన సూచీలు, ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. అంతర్జా తీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు దేశీయంగా ఫైనాన్షియల్, హెల్త్‌కేర్, ఆటో మొబైల్ షేర్లలో కొనుగోళ్లు, సూచీలను ముందుకు నడిపించాయి. చివరికి సెన్సెక్స్ 341.04 పాయింట్లు లాభపడి 74,169.95 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 111.55 పాయింట్లు పెరిగి 22,508.75 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకం లో రూపాయివిలువ 23పైసలు పెరిగి రూ.86.82 గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డా యి. ఐటిసి, నెస్లే ఇండియా, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.

## 'ఆర్థికవృద్ధికి ఈ రెండే కీలకం'

**న్యూఢిల్లీ, మార్చి 17:** భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి సాధించా లంటే బలమైన ప్రైవేట్ మూలధన వ్యయం, వినియోగం పెరగాలని భారతీయస్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. రూ.52 లక్షల కోట్లకుపైగా డిపాజిట్లున్న ఎస్‌బిఐ బ్యాంకుకు ఈయన ఇటీవల చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఓ ఇంటర్వ్యూలో ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితులను తెలియ చేస్తూ, భవిష్యత్తు వృద్ధిని అంచనా వేస్తూ వ్యాఖ్యలు చేశారు. దేశాభివృద్ధికి ప్రస్తుతం ఉన్న కొన్ని రంగాల్లో ప్రైవేటు మూలధన వ్యయం జరుగుతుండగా, ఉక్కు, సిమెంట్ వంటి కీలక పరిశ్రమలు పెట్టుబడులకు ముందుండాలని శెట్టి సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక పురోగతికి ఈ రంగాలు కీలకమని చెప్పారు. ప్రస్తుత త్రైమాసిక ఆర్థిక గణాంకాలు వృద్ధికి కీలకమైన వస్తు వినియోగంలో సానుకూల ధోరణిని సూచిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

భారతదేశం అర్థవంతమైన పురోగతిని సాధించడానికి 8శాతం జిడిపి వృద్ధి రేటు అవసరమని నొక్కి చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి వినియోగం పెంపు, ప్రైవేట్ రంగ పెట్టుబడుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థ పెరుగుదలపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టారిఫ్ సంబంధిత సమస్యల కారణంగా ఆర్థిక వ్యవస్థలో ప్రతికూలతలు నెలకొంటాయని భావించడం లేదని వివరించారు.

## 5జి ఇన్నోవేషన్ హ్యాకథాన్ 2025 ప్రకటించిన డాట్

**ముంబై, మార్చి 17:** 5జి టెక్నాలజీని ఉపయోగిం చి వినూత్న నమూనాలను అభివృద్ధిచేయడమే లక్ష్యంగా ఆరు నెలల ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ టెలికమ్యూనికేషన్స్ విభాగం (డాట్) ప్రారంభిం చింది. ఈ ప్రోగ్రామ్ ఆయా సంస్థలకు మార్గ దర్శకత్వం, నిధులు, 5జి యూజ్ కేస్ ల్యాబ్ లకు ప్రాప్యతనుఅందిస్తుంది. ఇందులో పాల్గొనే వారికి మేథో సంపత్తి హక్కులు సహాయంతో సహా వాణిజ్యీకరణకు అదనపు మద్దతు లభి స్తుంది. హ్యాకథాన్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణు లకు తెరిచి ఉంటుంది. 100 కంటే ఎక్కువ 5జి యూజ్ కేస్ ల్యాబ్‌లకు యాక్సెస్‌ను అందిస్తుంది. పాల్గొనేవారు దూరదృష్టి ఆలో చనలను స్కేలబుల్ టెక్నాలజీలుగా మార్చడానికి వీలు కల్పిస్తుంది. ఈ హ్యాకథాన్ ఎఐ-ఆధారిత నెట్‌వర్క్‌నిర్వహణ, ఐఒటి-ఆధారిత పరిష్కా రాలు, 5జి ప్రసారం, స్మార్ట్ హెల్త్, వ్యవసా యం, పారిశ్రామిక ఆటో మేషన్, నాన్-టెరెస్ట్రి యల్ నెట్‌వర్క్‌లు (ఎన్‌టిఎన్), డి2ఎం, వి2ఎక్స్, క్వాంటం కమ్యూనికేషన్ వంటి కీలకమైన 5జి అప్లికేషన్ లపై దృష్టిసారించిన ప్రతిపాదనలను ఆహ్వాని స్తుంది. వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్క రించడానికి నెట్‌వర్క్ స్లైసింగ్, సర్వీస్ నాణ్యత, కాల్-ఫ్లో దృశ్యాలు వంటి 5జి లక్షణాలను ఉపయోగించుకోవాలని పాల్గొనేవారిని ఇందులో ప్రోత్సహిస్తారు. అలాగే 5జి ఇన్నోవేషన్ హ్యాక థాన్ 2025లో పాల్గొనే వారు తమ ఆవిష్క రణలను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడడానికి హ్యాకథాన్ మద్దతు అంది స్తుంది. హ్యాకథాన్ అనేక దశల్లో జరుగుతుంది. ప్రతి ఒక్కటి ప్రతిపాదన సమర్పణ నుంచి తుది మూల్యాంకనం వరకు ఆలోచనలను పెంపొం దించడానికి, అభివృద్ధి చేయడానికి జాగ్రత్తగా రూపొందించబడింది.

## కంపెనీ సెక్రటరీగా కెరీర్



సంపన్నమైన్ కెరీర్ ను అభివృద్ధి చేయడానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన మార్గాలలో ఒకటి కంపెనీ సెక్రటరీ కోర్సు ను కొన్సాగంచడం, ఎందుకంటే ఇది అధిక సాయి గౌరవం మరియు ఉద్యగ సంతృప్తిని తెస్తుంది.

విద్యయర్హత కలిగిన సెక్రటరీలు **ఎంప్లాయిమెంట్‌లో** ఉండటానికి ఎంచుకోవచ్చు లేదా సర్టిఫికేట్ ఆఫ్ ప్రాక్టీస్ తీసుకోవచ్చు మరియు **స్వతంత్ర ప్రాక్టీస్ కంపెనీ సెక్రటరీ** కావచ్చు.

కంపెనీల చట్టం 2013 ఒక సంస్థలోని కంపెనీ సెక్రటరీలకు **కీ మేనేజిరియల్ పర్సనల్** (కెఎంపి) ప్రత్యేక హూదాను కల్పించింది, వారితో పాటు ఎండి, సిఇఒ, మేనేజర్, హూల్ టైమ్ డైరెక్టర్ (లు) మరియు సిఎఫ్ ఒ లతో గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుంది. కంపెనీల చట్టం 2013, ప్రాక్టీస్ చేసే కంపెనీ కార్యదర్శి ద్వారా **సెక్రటేరియల్ ఆడిట్‌ను** కూడా తప్పనిసరి చేస్తుంది, ఇది వారి పాత్రను మరింత విస్తృతంగా మరియు సమ్మిళితంగా చేస్తుంది.

రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ మిటిగేషన్, ఈఎస్ జీ, వాల్యుయేషన్, దివాలా, సోషల్ ఆడిట్, విలీనాలు, కొనుగోళ్లు, ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్, రిప్రజెంటేషన్ సర్వీసెస్ తదితర రంగాల్లో కంపెనీ సెక్రటరీలకు విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐ.సి.ఎస్.ఐ),** భారతదేశంలో కంపెనీ కార్యదర్శి సభ్యత్వాన్ని ఇచ్చే ఏకైక ప్రధాన జాతీయ ప్రొఫెషనల్ బాడీ, కంపెనీ సెక్రటరీస్ యాక్ట్, 1980 కింద ఏర్పాటైన ఈఐసీఎస్ఐ భారత దేశంలో కంపెనీ సెక్రటరీల వృత్తిని నియంత్రించడానికి మరియు అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

ఐసిఎస్ఐ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ మరియు నోయిడాలో ఉంది. ఐసీఎస్ఐకి న్యూఢిల్లీ, కోల్కతా, చెన్నై, ముంబైలలో 4 ప్రాంతీయ కార్యాలయాలు, భారతదేశంలో 73 చాప్టర్ కార్యాలయాలు, నవీ ముంబై, హైదరాబాద్, కోల్కతాల్లో 3 కార్పొరేట్ గవర్నెన్స్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్లు, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, యూఏఈ, యూకే, యూఎస్ఏల్లో 6 ఓవర్సీస్ సెంటర్లు ఉన్నాయి.

**అర్హత మరియు రిజిస్ట్రేషన్ :**

రిమోట్ ప్రాక్టర్డ్ విధానంలో ఏడాదికి 4 సార్లు నిర్వహించే కంపెనీ సెక్రటరీ ఎగ్జిక్యూటివ్ ఎంట్రన్స్ టెస్ట్ (సీఎస్ఈఈటీ) రాయడం ద్వారా ఏదైనా స్ట్రీమ్ (ఫైన్ ఆర్ట్స్ మినహా) విద్యార్థులు కంపెనీ సెక్రటరీ కోర్సులో చేరవచ్చు. **సీఎస్ఈఈటీ (CSEET)** లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కంపెనీ సెక్రటరీ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. **గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు మరియు ఐసీఏఐ (ICAI)/ఐసీఎంఏఐ (ICMAI)** లో ఫైనల్ పాస్ అయిన విద్యార్థులకు సీఎస్ఈఈటీ నుంచి మినహాయింపు ఉంది. సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణత సాధించిన తర్వాత విద్యార్థులు సీఎస్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ చేరవచ్చు.

**శిక్షణ మరియు ఆర్థిక సహాయం :**

ఐసిఎస్ఐ సిఎస్ కోర్సు మెటీరియల్‌ను అందిస్తుంది మరియు దాని ప్రాంతీయ మరియు చాప్టర్ కార్యాలయాలలో తన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తుంది. ఉచిత ఆన్‌లైన్ క్లాసులు, ప్రముఖ అధ్యాపకుల లెక్చర్లు, రియల్ టైమ్ డౌట్ క్లియరింగ్‌ను కూడా నిర్వహిస్తోంది.

విద్యార్థులు ఐసిఎస్ఐలో వివిధ శిక్షణా కార్యక్రమాలను పొందుతారు మరియు వారి ప్రధాన సామర్థ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ మరియు నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి కార్పొరేట్ లు మరియు ప్రాక్టీస్ చేసే కంపెనీ సెక్రటరీలతో ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకోవలసి ఉంటుంది. ఐసీఎస్ఐలో విద్యార్థులకు స్కాలర్షిప్లు/ఫీజు మాఫీ/కన్సెషన్ రూపంలో వివిధ ఆర్థిక సహాయ పథకాలు అందుబాటులో ఉన్నాయి. సమాచారం కోసం **www.icsi.edu** లోకి లాగిన్ అవ్వండి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.